RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 25 సెప్టెంబర్ 2025 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:98

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు





**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

203 నుండి 216 బూత్ ల ఇంచార్జ్జి,తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో వెంగళరావు నగర్ డివిజన్ అధ్యక్షులు మనోజ్ అధ్యక్షతన జూబ్లీహిల్స్ జవహర్ నగర్ లోని 203 నుండి 216 బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని కళ్యాణ్ నగర్ లో గల ముగ్ధ బ్యాంకెట్ హాల్ లో నిర్వహించారు.

ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. జరగబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేందుకు కార్యకర్తలకు దిశా నిర్దేశాన్ని చేశారు. ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకొని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు.

బూత్ కమిటీలలో యువతకు అవకాశం కల్పించాలని,సీనియర్ నాయకులు పార్టీ గెలుపుకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులే తప్ప జూబ్లీహిల్స్ లో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి కనబడడం లేదని అన్నారు.

పదేళ్ల పాలనలో బీ ఆర్ ఎస్ పార్టీ వల్ల జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని అన్నారు.

సొంత పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పి భారీగా పార్టీలో చేరికలు అంటూ ఫోటోలు తీసుకొని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం విడ్డూరమని హెగ్దేవ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల పై చాలా ఆసక్తిగా ఉన్నారని,పార్టీ సలహాలు సూచనలతో స్థానిక నాయకులు ముందుకు వెళ్లాలని తెలిపారు.

చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ..

బూత్ లలో గుర్తించిన సమస్యలను అతి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మలని కోరారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్ మన్నెం మోహన్ రెడ్డి ,కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరెంపులలో ఆనందోత్సవం

### పొంగులేటి క్రీమ్ కలర్ కుర్తా పైజామా ప్రత్యేక ఆకర్షణ



**పాలేరు నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం)**పాలేరు నియోజకవర్గం ఆరెంపుల గ్రామం బుధవారం పండుగ వాతావరణంలో కళకళలాడింది కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గుమ్మాల వద్ద పూలతోరణాలు ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు గృహాల చుట్టూ వినిపించిన మంగళధ్వానాలు కొత్త జీవితానికి సంకేతాలు వెలిగించాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఈ గ్రామంలో గృహప్రవేశాలు ఘనంగా జరగగా... ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాకతో ఉత్సవం మరింత ఉప్పొంగింది. ఈ వేడుకలో మంత్రి పొంగులేటి వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా అందరి చూపులను కట్టిపడేసింది. ఆయన ధరించిన క్రీమ్ కలర్ కుర్తా





పైజామా అందరి దృష్టిని తనవైపు తిప్పేసింది. గ్రామస్తులు పొంగులేటి శీనన్న సాదాసీదా స్టైల్ ఎంత బాగుందో అంటూ చర్చించుకున్నారు. కొత్తగా గృహ ప్రవేశం చేసుకున్న వారందరికీ మంత్రి పొంగులేటి అభినందనలు తెలిపి పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు



దసరా ఉత్సవాలకు విజయవాడ వచ్చిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కి విమానాశ్రయంలో స్వాగతం పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు


## ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట లొంగిపోయిన 71 మంది మావోయిస్టులు

### వీరిలో 50 మంది పురుషులు, 21 మంది మహిళలు

### అందులో 30 మందిపై రూ.64 లక్షల రివార్డు

దంతెవాడ సెప్టెంబర్ 24 : మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మావోలు నెమ్మదిగా పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం దంతెవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ ఎదుట ఏకంగా 71 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 50 మంది పురుషులు, 21 మంది మహిళలు ఉన్నారు. అందులో 30 మందిపై రూ.64 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజి సుందర్‌రాజ్ తెలిపారు.లొంగిపోయిన మావోలు గతంలో అనేక విధ్వంసక సంఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు ఐజి పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని స్థానిక అధికారులు స్పష్టం చేశారు. మావోయిస్టులు హింసాయుత విధానాలు వదిలివేసేలా చేయడమే తమ ఉద్దేశమని.. జనజీవన స్రవంతిలో కలిసే వారికి ఉపాధి అవకాశఆలు కల్పిస్తామన్నారు.

## పబ్లిక్ టాయిలెట్స్ ఖబ్జా



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** గోషామహల్ నియోజకవర్గం జాంబాగ్ డివిజన్ శెంకర్ బాగ్ ఖాలాన్ తుల్జాభవాని టెంపుల్ ప్రక్కన జీహెచ్ఎంసీ వారి పబ్లిక్ టాయిలెట్స్ వుండేవిగతంలో. ఈరోజు అట్టి స్థలానికి టాక్స్ విభాగం వారు ఇంటి నెం. బై నెంబర్ కేటాయించటం జరిగింది. ఎలాకేటాయించారో విచారణ చేస్తూ బహుళ అంతస్తు నిర్మాణం చేపడుతున్నారు తక్షణమే నిర్మాణాలు ఆపాలని ప్రజలు కోరుకుంటున్నారు.ఈ సందర్భంగా గోషామహల్ డెవెలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు బి.సతీష్‌గౌడ్ మాట్లాడుతూ జాంబాగ్ డివిజన్‌లోని 5-3లో ఖబ్జాలకు నిలయంగా మారిందని సంబంధిత అధికారులు ఖబ్జాల కొరకు స్థానిక ప్రజలు కంప్లైట్ చేసిన పట్టించుకోకుండా కబ్జా దారులకు సహకరిస్తూ డిపార్ట్‌మెంట్‌లోని లుసుకులు తెలియజేస్తూ కోర్టు ద్వారా ఆర్డర్లు తెప్పిస్తూ కోర్టు ఆర్డర్ కాపీలను కంప్లైనర్‌కు ఇవ్వకుండా కబ్జాదారులకు అనుకూలంగా కంప్లైనర్లను భయభ్రాంతులను చేస్తూన్నారు. సూర్యామహల్ పట్టాదారుల ల్యాండ్‌లు పట్టాదారులను వెళ్ళగొట్టి ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చిత్రికరించి అపార్ట్‌మెంట్ కట్టడం జరిగినది అని తెలియజేసినారు.

## 'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా హైదరాబాద్

### హైదరాబాద్ లో 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్' జీసీసీ ప్రారంభం

### అమెరికా వెలుపల, భారత్ లో మొట్టమొదటిది ఇదే

### 75 మిలియన్ డాలర్ల పెట్టుబడి...3వేల మందికి కొత్తగా ఉద్యోగాలు

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్‌ను 'గ్లోబల్ హెల్త్ కేర్ హబ్'గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్' సంస్థ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఆయన రాయదుర్గంలో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 'హెచ్‌సీఏ హెల్త్‌కేర్ ప్రధానంగా అమెరికా, యూకేలలో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థకు 190 ఆసుపత్రులు, 2,400 కేర్ సైట్లు ఉన్నాయి. మొత్తం 3.16 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఫార్చ్యూన్ 100 కంపెనీ వార్షిక ఆదాయం 70 బిలియన్ డాలర్లు' అని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'ఇలాంటి దిగ్గజ సంస్థ అమెరికా వెలుపల భారత్‌లో తన మొట్టమొదటి జీసీసీని ఏర్పాటు చేసేందుకు తెలంగాణను ఎంచుకోవడం మనందరికీ గర్వకారణం. ఇది హైదరాబాద్‌కున్న ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ నైపుణ్యం కలిగిన మానవ వనరులకు నిదర్శనం' అని పేర్కొన్నారు. '4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో హెచ్ సీఏ హెల్త్ కేర్ 75 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 620 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ జీసీసీ కేవలం ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాకుండా, ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఐటీ, సప్లై చైన్, ప్రొక్యూర్‌మెంట్, మానవ వనరులు, ఫైనాన్స్, అకౌంటింగ్ తదితర విభాగాల్లో ప్రస్తుతం 1200 మందికి, 2026 నాటికి 3 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయి' అని చెప్పారు. 'హైదరాబాద్ గ్లోబల్ హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు ముఖద్వారంగా ఎదుగుతోంది. ప్రపంచ స్థాయి ఆసుపత్రులు, 800కు పైగా ఫార్మా కంపెనీలు, ప్రముఖ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ జీసీసీలు, అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలతో గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా రూపాంతరం చెందుతోంది. అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూనే సరసమైన ఆరోగ్య సంరక్షణను ప్రపంచానికి అందిస్తుంది' అని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్, ఐటీ సలహాదారు సాయికృష్ణ, హెచ్ సీఏ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ మైక్ మార్ఫ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎమిలీ డంకన్, హైదరాబాద్ సెంటర్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ అతుల్ కపూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబలం

25 సెప్టెంబర్ 2025 గురువారం

# ప్రజాస్వామ్యం పేరు మీద అవినీతి

కట్టు బొట్టులో నేపాల్, భారత్ ఒకటేనని మన ప్రధాని అంటున్నారు. అట్లే అక్కడ ఇక్కడ పాలకుల అవినీతిలో, యువత నిరుద్యోగంలో కూడా ఒకటేనా? 187 ప్రపంచ దేశాలలో అవినీతిలో నేపాల్ 107వ స్థానంలో ఉండగా భారత్‌ది 96వ స్థానం. మానవ వనరుల అభివృద్ధిలో నేపాల్ 145వది కాగా, భారత్ 130వది. భారత్‌లో ఒక శాతం సంపన్నుల చేతిలో 40 శాతం పైగా దేశ సంపద ఉండగా, నేపాల్‌లో పది శాతం సంపన్నుల చేతిలో 40 శాతం పైగా ఆ దేశ సంపద ఉన్నది. మన దేశంలో గాని నేపాల్‌లో గాని ఆర్థికవృద్ధి జరిగింది గాని ఆర్థికాభివృద్ధిలో లేదు. అందరినీ కలుపుకొని పోయేదే ఆర్థికాభివృద్ధి. 25 శాతం యువత అటు నేపాల్‌లో ఇటు భారత్‌లో నిరుద్యోగ నిస్పృహలతో కుటుంబాలకు భారంగా మారిన వారే. చదువుకున్న యువత నిరుద్యోగం ఇంకా ఎక్కువ. నిరుద్యోగుల్లో 60 శాతం వరకు చదువుకున్నవారే. బీటెక్ లాంటి కోర్సు చేసిన వారి నిరుద్యోగిత రేటు 2025 లో 83% వరకు ఉన్నదని, ఉన్న ఉద్యోగాలు కూడా ఎప్పుడు పోతాయో అని సందేహాలు ఉన్నాయి. వారే నిరాశ నిస్పృహలతో పని పాట లేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతున్నారు. అటు ఆర్థికాభివృద్ధికి ఇటు సామాజిక భద్రతకు నష్టం వాటిల్లేది యువతలో అశాంతి హెచ్చరిల్లడం వల్లే కదా.. దేశంలో పాలకులు వ్యవహరించే తీరు వలన కోట్ల కొలది యువతీ యువకులు నిరాశ నిస్పృహలతో నీరసించి పోతున్నారు. దీనివల్ల కుటుంబం, సమాజం, దేశం అశాంతికి గురి కాబడుతుంది. యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించి అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలో మమేకం చేయగలిగితే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. చదివిన చదువుకు సరైన ఉద్యోగం దొరకక కనీస సంపాదనకు సైతం నోచుకోక దుర్భర పరిస్థితిలో మన యువత ఉండటం శోచనీయం. డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి వ్యవ సాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాల కులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం చాలా వేగంగా అభివృద్ధి చెందడం, జాబ్ మార్కెట్ కూడా సాంకేతిక విద్య అభివృద్ధి చెందడం వలన యువతకు అనుకూలమైన కావలసిన నైపుణ్యాలను కల్పించగలిగితే సాంకేతిక సాధికారికతో దేశం మెరిసిపోతుంది. ఎందుకంటే ఇంజనీరింగ్ పట్టభద్రులు కూడా సగానికి పైగా నిరుద్యోగులుగా ఉన్నారు. ప్రపంచంలో అత్యంత అల్ప స్థాయిలో సాంకేతిక నైపుణ్యాలను కలిగిన దేశం మనది. మొత్తం శ్రామి కులలో కేవలం 4.69% మాత్రమే ఎంతో కొంత నైపుణ్యం కలిగి ఉన్నారు. మొత్తం శ్రామికుల విషయానికి వస్తే చైనాలో 24%, అమెరికాలో 52%, యునైటెడ్ కింగ్డమ్ 68%, జర్మనీలో 75%, జపాన్‌లో 80%, సౌత్ కొరియాలో 96% శ్రామికులు పూర్తి నైపుణ్యాలతో ఆర్థిక అభివృద్ధికి ఆయా దేశాలలో సహాయపడుతున్నారు. మన దేశం లో మాత్రమే అత్యంత తక్కువ స్థాయిలో నైపుణ్యం కలిగిన శ్రామికులు ఉన్నారు. కాబట్టి మన దేశంలో శ్రామికుల నైపుణ్య శాతం పెంచాలి. ముఖ్యంగా యువత సాంకేతిక నైపుణ్యాన్ని పెంచగలిగితే దేశా భివృద్ధి వేగంగా జరుగుతుంది. నేపాల్‌లో 2008లో రాచరిక వ్యవస్థను కూలదోసి కమ్యూనిస్టులు అని చెప్పుకునే ప్రజాస్వామ్యవాదులు నేపాల్‌లో ప్రభుత్వాన్ని స్థాపించారు. 2008 నుంచి 18 సంవత్సరాల్లో అక్కడ 15 ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ ప్రభుత్వాలు బహిరంగంగానే అవినీతికి బంధుప్రీతికి పాల్పడుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వాల పాలన పట్ల ప్రజలు విసిగిపోయి పాలకులను గద్దె దించేందుకు పోరాడారు. 2025లో మాజీ రాజు నేపాల్ అంతటా పర్యటించారు. ఆయన సభలకు పెద్ద ఎత్తున యువత హాజరయ్యారు. నేపాల్ రాచరిక వ్యవస్థను పారదోలి అవినీతి ప్రభుత్వాలను స్థాపించామని ప్రజల్లో ఆలోచన మొదలైంది. ముఖ్యంగా యువత నేపాల్ ప్రభుత్వాన్ని కోలదోయడంలో యువతకూ ఆ దేశ సైన్యాన్ని ఎదుర్కొన్నారు. రాజకీయ వేత్తలను తరిమికొట్టారు. వారి ఆగ్రహానికి తట్టుకోలేక ప్రధాని కేపీ శర్మ ఓలి, ఆయన మంత్రివర్గ సహచరులు నేపాల్ విడిచి పారిపోయారు. అక్కడి యువత నిరుద్యోగమే ప్రధాన కారణంగా మనకు కనబడుతుంది. ప్రపంచ బ్యాంకు ప్రకారం నేపాల్ యువతలో ఐదుగురిలో ఒకరు నిరుద్యోగులు.. పాలకులు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని నిలబెట్టుకోలేక పోయారు. మనదేశంలో కూడా 2014లో మన ప్రధాని ప్రతి ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగ కల్పన చేస్తానని వాగ్దానం చేశారు. కానీ దానిని నిలబెట్టుకోలేకపోయారు. ఈ పది సంవత్సరాల కాలంలో ఆ లెక్కన 20 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించి ఉంటే మన దేశం మెరిసిపోయేది. అలా కాకుండా బిలీనీయర్ల సంఖ్య పెరిగితే దేశం మెరిసిపోతుందనుకోవడం యువతకు అర్థం కావటం లేదు. అందుకే ఇలాంటి పరిణామాలు. ఇలాగే కొనసాగితే భారత్ యువత కూడా నేపాల్ బాట పట్టక తప్పని పరిస్థితి ఎదురవుతుంది. తస్మాత్ జాగ్రత్త!

# కృష్ణా జలాల వాటాపై రేవంత్.. ఉత్తమ్ కుమార్ లది పూట పూటకో మాట, ఘడియ ఘడియకో లెక్క



హైదరాబాద్ సెప్టెంబర్ 24 కృష్ణా జలాల వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది ఒక మాట, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిది మరో మాట అని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. పూట పూటకో మాట, ఘడియ ఘడియకో లెక్క చెబుతున్నారని దుయ్యబట్టారు. కృష్ణ జలాల్లో 299 టిఎంసిల వాటా ఒప్పుకొని తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీనేనని చురకలంటించారు. కృష్ణా జలాల్లో వాటా విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మల్లా పాత పాటే పాడిండని, ఉత్తర కుమార ప్రగల్భాలే పలికిండని, బేసిన్ల గురించి బేసిక్స్ కూడా తెయదని చురకలంటించారు. నీళ్ల వాటా గురించి అడిగితే నీళ్లు నములుతారని, కనీస అవగాహన లేని, తెలంగాణ సోయి లేని ఇట్లాంటి దద్దమ్మలు మనకు ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి కావడం మన దౌర్భాగ్యమన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి నిన్న ఏం మాట్లాడారని అడిగారు. కృష్ణా జలాల్లో 763 టిఎంసిలు ఇవ్వాలని డిమాండ్ చేశామని అని గొప్పగా చెప్పారని, రైట్ షేర్ కోసం తానే స్వయంగా ట్రిబ్యునల్ ముందు అటెండ్ అయినట్లు చెప్పుకున్నారని చురకలంటించారు. హరీష్ రావు తన సోషల్ మీడియా ఖాతా పోస్టులో చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18.06.2025 రోజున కృష్ణా బేసిన్ మీద 500 టిఎంసిలకు బ్లాంకెట్ ఎన్ ఓసి ఇచ్చిన తరువాత ఏ ప్రాజెక్టులైన కట్టుకోండి అని ఎపి సిఎం చంద్రబాబుకు ఆఫర్ ఇచ్చారని దుయ్యబట్టారు. మొన్న సెప్టెంబర్ 13న జరిగిన నీటి పారుదల శాఖ సమీక్షలో ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా జలాల్లో 904 టిఎంసిల వాటా సాధించి తీరాలని అంటున్నారని, ఉత్తమ్ కుమార్ రెడ్డి 763 టిఎంసిల రైట్ షేర్ అంటున్నారని, ముఖ్యమంత్రి ఏమో ఓ సారి 500 టిఎంసిలు అంటున్నారని, మరోసారి 904 టిఎంసిలు అంటున్నారన్నారు. రేవంత్, ఉత్తమ్ అజ్ఞానంతో తెలంగాణ రాష్ట్రం హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోయే పరిస్థితి దాపురించిందన్నారు. ముఖ్యమంత్రి చెప్పింది కరెక్టా? నీళ్ల మంత్రి చెప్పింది కరెక్టా? అసలు ఎవరిది కరెక్టు? అని అడిగారు. కనీస అవగాహన లేకుండా ఎలా మాట్లాడుతున్నరని, కనీసం ప్రిపరేషన్ లేకుండా ఇలా ఎన్నాళ్లు ఉంటారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కృష్ణా జలాల్లో రైట్ ఫుల్ షేర్ సాధించేందుకు సెక్షన్ 3 కోసం పోరాటం చేసారని, అప్పటి కేంద్ర మంత్రులు ఉమా భారతి, గడ్కరీ, షకావత్, ప్రధాని మోడీలను కలిశారని, సుప్రీం కోర్టు గడప తొక్కి నిర్విరామ పోరాటం చేసి సెక్షన్ 3 సాధించారని, 763 టిఎంసిలు అనేది కెసిఆర్ పట్టుబట్టిన విషయాన్ని హరీష్ రావు గుర్తు చేశారు. ఒక బాధ్యత లేదు, రాష్ట్రం మీద ప్రేమ లేదు, నీటి ప్రయోజనాల మీద పట్టింపు లేదు, ద్రోహం చేసినోల్లే సుద్దులు చెబుతున్నారని దుయ్యబట్టారు. 299:512 ద్రోహం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, ఇప్పుడు సిగ్గు లేకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారని, 512:299 నీటి వాటాను బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చిందని కాంగ్రెసోళ్లు చెప్పడంతో పాటు చారిత్రక అన్యాయాన్ని సరి చేస్తున్నామనడం సిగ్గుచేటు అని హరీష్ రావు అన్నారు. ఛీ నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు అని, ముఖ్యమంత్రి అంతే, నీళ్ల మంత్రి కూడా అంతే. 299:512 హక్కుల విషయంలో తాము సంతకం పెట్టినట్టు నిరూపిస్తే తాను పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తావా? అని సవాల్ విసిరారు. కృష్ణా జిలాల్లో 299:512 వాటా ఇచ్చి తెలంగాణ తీరని చారిత్రక ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ అని, 2013లో ఉమ్మడి ఎపి జస్టిస్ శ్రీ కృష్ణ కమిటికి రిపోర్టు ఇచ్చిందని, ఇదే రిపోర్టును శాసనసభలోనూ పెట్టారని, తెలంగాణకు కృష్ణాలో 299, ఎపికి 512 ఇచ్చినం అని అందులో క్లియర్ గా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రాంత హక్కులకు ఉమ్మడి రాష్ట్రంలోనే మరణ శాసనం రాసింది కాంగ్రెస్ పార్టీ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకుల చేతగాని తనం, అడుగులకు మడుగులొత్తడం వల్ల 299 వాటా పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్ హక్ కు, ఫైనల్ అవార్డుకు తేడా తెలియని తెలివితక్కువ వారు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ అని హరీష్ రావు మండిపడ్డారు. 'ఈ విషయంలో చారిత్రక తప్పిదం చేసింది మీరు కాదా? అని, తెలంగాణ సాగు నీటి రంగం చరిత్రలో ద్రోహులు మీరే' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మక్క సాగర్ పూర్తి చేసింది బిఆర్ఎస్ అని, డబ్బా ప్రచారం చేసుకుంటున్నది కాంగ్రెస్ అని, చంద్రబాబుకు భయపడి బనకచర్లపై మౌనం ఎందుకు అని ప్రశ్నించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఉందని ఆల్మట్టి ఎత్తు పెంపుపై మౌనం ఎందుకు అని నిలదీశారు. సిఎం రేవంత్ రెడ్డికి సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే, పక్క రాష్ట్ర ప్రయోజనలే ఎక్కువ? అని హరీష్ రావు ధ్వజమెత్తారు. సమ్మక్క సారక్క బ్యారేజ్ కు మంత్రి ఉత్తమ్ అనుమతులు సాధించినట్టు చెప్పుకుంటున్నారని, కొండను తవ్వి ఎలుకను ఉత్తమ్ కూమార్ పట్టుకున్నారని, ఛత్తీస్ ఘడ్ తో కేవలం యాభై ఎకరాల ముంపునకు సంబంధించి సూత్రప్రాయ అంగీకారం కుదిరితే ఏవో గొప్పలు సాధించినట్టు ప్రచారం చేసుకుంటున్నారని, కాంగ్రెస్ చేసిన తప్పులను సరిదిద్ది దేవాదులను పటిష్టం చేసేందుకు ఏడు టిఎంసిల సామర్థ్యంతో సమ్మక్క సారక్క బ్యారేజ్ ను కెసిఆర్ నిర్మించారని, 83 మిటర్లకు డిపిఆర్ పంపామని, అన్ని డైరెక్టరేట్ల నుంచి అన్ని రకాల అనుమతులు సాధించామని, బ్యారేజీ కట్టినామని, నీటిని కూడా లిఫ్టు చేసుకుంటున్నామని, సమ్మక్క బ్యారేజ్ కు ఛత్తీస్ ఘడ్ నుంచి ఒక్క ఎన్ఓసి మినహా అన్ని అనుమతులు బిఆర్ఎస్ హయాంలోనే వచ్చాయని, ప్రాజెక్టులకు అనుమతులు ఆపడంలో ఆరితేరిన కాంగ్రెస్ పార్టీ సమ్మక్క సాగర్ విషయంలోనూ అదే చేసిందని దుయ్యబట్టారు. 2023 ఎన్నికల వేళ ఛత్తీస్ ఘడ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, ఇక్కడి కాంగ్రెస్ నాయకులు అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి ఎన్ఒసి రాకుండా చేశారని, ఇప్పుడు అక్కడున్న బిజెపి ప్రభుత్వంతో దోస్తీ కట్టి 50 ఎకరాలకు సూత్రప్రాయ అంగీకారం తీసుకొచ్చారని, మొత్తం ప్రాజెక్టునే కట్టినట్లు బిల్డప్ ఇస్తున్నారని హరీష్ రావు దుయ్యబట్టారు. 50 ఎకరాలపై ఒప్పందం చేసుకుంటేనే కాంగ్రెస్ ఇంత ప్రచారం చేసుకుంటే ఎన్నో ప్రాజెక్టులు ఎంతో కష్టపడి సాధించిన కెసిఆర్ ఎంత ప్రచారం చేసుకోవాలన్నారు. సమ్మక సాగర్ విషయంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని, డబ్బా ప్రచారం చేసుకుంటున్నారని, ఆల్మట్టి హైట్ పెంపుపై ఎందుకు మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్, కర్ణాటక కాంగ్రెస్ కలిసి చేస్తున్న ద్రోహం ఇది అని, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి తెలంగాణ రైతాంగానికి మరణ శాసనం రాస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి, బిహార్ కు వెళ్లి రాజకీయాలు చేస్తున్నారని చురకలంటించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచాలని కర్ణాటక మంత్రిమండలి నిర్ణయం తీసుకుంటే ఏం చేస్తున్నారని హరీష్ రావు నిలదీశారు. కేవలం 100 టిఎంసిల కోసమే ఆల్మట్టి ఎత్తు పెంచడం లేదని, కృష్ణా జలాల్లోని తెలంగాణ హక్కును బొందపెట్టి ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డిలను ఎడారులుగా మార్చేందుకు కర్నాటక కాంగ్రెస్ పన్నుతున్న కుట్ర ఇది అని మండిపడ్డారు. అక్కడా కాంగ్రెస్సే, ఇక్కడా కాంగ్రెస్సే అయినా మాట్లాడే దమ్ము తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. తెలంగాణ రైతుల పొట్టగొడుతుంటే ఆపే ధైర్యం లేదా? అని, జాతీయ పార్టీకి జాతీయ విధానమే లేదని, కర్ణాటక రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని, ఇక్కడి రైతులను బలిస్తారా? అని అడిగారు. బనకచర్ల రూపంలో కృష్ణా నీళ్లను ఎపి కొల్లగొడితే మౌనం వహించారని, ఇప్పుడు కర్ణాటక కొల్లగొడుతుంటే కూడా మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని హరీష్ రావు చురకలంటించారు.

# ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్‌ను గెలిపించాలి
## బి ఆర్ ఎస్ ఫామ్‌హౌజ్‌కే పరిమితం :
## తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ.ఫహీం





జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మంచి మెజార్టీతో గెలిపించాలని టిపిసిసి ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ.ఫహీం కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. పలువురు ముస్లిం యువకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, ఉప ఎన్నిక, కాంగ్రెస్ పార్టీ విజయం అవశ్యకత, ప్రజాపాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రధాన్యతలు తదితర అంశాలను యువకులతో చర్చించారు. ప్రజాక్షేత్రంలో విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని, అందుకు యువత ముందు భాగాన నిలువాలని ఫహీం సూచించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ పేద వర్గాల అభ్యున్నతికి, హైదరాబాద్‌లోని బస్తీలను ఏ మాత్రం పట్టించుకోలేదని, వారు ఎంత సేపే కమీషన్ల కోసం వచ్చే పనులపైనే దృష్టి కేంద్రీకరించారని , అందుకే వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రజలు బి ఆర్ ఎస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చినప్పటికీ ఆ హోదాను కూడా ఆ పార్టీ నాయకులు సక్రమంగా నిర్వహించడం లేదని, కెసిఆర్ కనీసం అసెంబ్లీ సమావేశాలకు కూడా రావడం లేదని, దీనిని కూడా బిఆర్ ఎస్ నాయకులు అదేదో పెద్ద గొప్ప పని చేసినట్టుగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఉన్నదనే బి ఆర్ ఎస్ నాయకులు బస్తీలకు వస్తున్నారని, ఎన్నికలు కాగానే వారు మళ్లీ ఫామ్ హౌజ్‌లకు పరిమితం అవుతారని ఆరోపించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా పాలన అందిస్తూ, ప్రజల కష్టాలను వింటూ, వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజలు అండగా నిలువాలని, కోరారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

# రైల్వే స్టేషన్ లో నాకా బంది నిర్వహించిన పోలీసులు
## పెండేకల్ ఆర్.ఎస్ నందు డాగ్ స్క్వాడ్,బాంబ్ స్క్వాడ్ తో తనిఖీలు చేసిన పోలీసులు

తుగ్గలి మండల పరిధిలోని గల పెండేకల్ ఆర్.ఎస్ రైల్వే స్టేషన్ నందు తుగ్గలి, జొన్నగిరి పోలీసులు నాకా బంది ను నిర్వహించారు. గంజాయి,మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పత్తికొండ డి.ఎస్.పి వెంకటరామయ్య,రూరల్ సీఐ పులి శేఖర్ ల సూచనల మేరకు బుధవారం రోజున తుగ్గలి ఇన్చార్జి ఎస్ఐ ఎన్.సి మల్లికార్జున ఆధ్వర్యంలో పెండేకల్లు ఆర్.ఎస్ ప్లాట్ఫామ్,అనుమానితుల బ్యాగులను,పార్సిల్ కార్యాలయాన్ని వారు తనిఖీ చేశారు. గుత్తి నుండి కర్నూలు కు వెళ్తున్న డెమో రైలును పోలీసు అధికారులు తనిఖీ చేశారు. పార్సిల్ కార్యాలయంలో ఏదైనా పార్సిల్ అనుమానాస్పదంగా ఉన్నా,ఎక్కువ రోజులు పార్సిల్ డెలివరీ కాకుండా ఉంటే అటువంటి సమాచారాన్ని పోలీసులకు సమాచారం అందించాలని వారు తెలియజేశారు. ఎవరైనా నిషేధిత గంజాయి మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఎవరికైనా డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టీం టోల్ ఫ్రీ నెంబర్ 1972 సమాచారం అందించాలని,సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలియజేశారు. ఇప్పటికే పోలీసు వారు మాదక ద్రవ్యాలపై ఈగల్ టీం,పోలీసులు డ్రగ్స్ వద్దు బ్రో అనే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పోలీసులు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్,బాంబు స్క్వాడ్ పోలీసులు,తుగ్గలి మరియు జొన్నగిరి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత వెనుక వాస్తవాలు

తెలంగాణ రాష్ట్రంలో యూరియా పంపిణీపై ప్రతికూల వార్తలను ఈ మధ్య సోషల్ మీడియాలో, వార్తా పత్రికలలో కోకొల్లలుగా చూస్తున్నాం. ఒక వికలాంగ రైతు యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడి తీవ్రంగా గాయపడిన సంఘటన మహబూబాబా ద్ జిల్లాలో జరిగింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఇందుకు కారణమైన జిల్లా యంత్రాంగంపై చట్టరిత్యా చర్యలు తీసుకోవడానికై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో యూరియా పంపిణీని పరిశీలిస్తే వాస్తవంగా కొరత ఉందా? లేదా కృత్రిమంగా సృష్టించబడిందా? అన్న అనుమానాలు కలుగకమానవు. రాష్ట్రానికి కావాల్సిన యూరియా ఎంత అవసరం అనేది రాష్ట్ర వ్యవసాయశాఖ సీజన్‌ల వారిగా గత నాలుగు సంవత్సరాలలోని సరఫరా, పంపిణీల ఆధారంగా లెక్కించి, ఈ సీజన్‌కు ఎంత అవసరమో నిర్ధారిస్తుంది. ప్రతినెలలో ఈ అంచనాల వివరాలు రాష్ట్ర అధికారులు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్ శాఖకు తెలియపరుస్తారు. ఈ వివరాలను కేంద్ర మంత్రిత్వశాఖ పరిగణనలోకి తీసుకుని తదనుగుణంగా చర్యలు చేపడుతుంది. అధికారుల అంచనాల ప్రకారం 2025 వానాకాల సీజన్ అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 9లక్షల 80వేల టన్నుల యూరియా అవసరమని ప్రణాళికలు తయారు చేసుకున్నారు. దీనిని రాష్టవ్యాప్తంగా 2020-24 సంవత్సరాలలో వాడబడిన మొత్తం యూరియా నుంచి యావరేజ్‌గా లెక్కించి రూపొందించారు. ఈ సీజన్‌లో పంపిణీ జరిగిన యూరియాను పరిశీలిస్తే సెప్టెంబర్ మొదటి వారం వరకే దాదాపు 8లక్షల 33వేల టన్నుల పంపిణీ పూర్తి అయ్యింది. గత సంవత్సరంతో పోలిస్తే, ఈ సీజన్‌లో ఇప్పటికే పంపిణీ చేయబడిన యూరియా 85 శాతం దాటింది. కేవలం 10-15 శాతం పంపిణీ తేడా ఉంది. అయితే అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం యూరియా కొరత తలెత్తుతుందనే ముందస్తు ఆలోచనతో కేంద్రం నుండి సెప్టెంబర్ మాసం కోటాతో పాటు అదనంగా యురియా కావాలని అడగడం జరిగింది. నిజానికి ఈ కొద్ది యూరియా కొరత రాష్ట్రాన్ని ఇంతలా వేధించదు. కాబట్టి దీని వెనకాల ఉన్న నిగూఢ అంశాలను కూడా మనం అర్థం చేసుకోవాలి. రాష్ట్రంలో రైతులకు యూరియా అందటం లేదనే వార్తలు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమైనవి. అప్పుడే కలెక్టర్లు సరైన రీతిలో స్పందించుంటే బాగుండేది. కానీ యూరియా పంపిణీలపై అప్పటికే జరుగుతున్న దుష్ప్రచారాన్ని అడ్డుకోవడంలో జిల్లా స్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. అలాగే ప్రైవేటు డిస్ట్రిబ్యూటర్‌లకు కేటాయించిన 40శాతం యూరియాను సొసైటీలకు మళ్లించి ఉంటే రైతులకు కొంత ఊరట లభించేది. ప్రైవేటు డిస్ట్రిబ్యూటర్‌లకు కేటాయించిన యూరియా కేవలం పెద్ద రైతుల చేతుల్లోకి వెళ్లింది. మరికొందరు రైతులు అతిగా భయపడి యాసంగి పంట కోసం నిల్వచేసు కోవడం మొదలు పెట్టే సరికి కొరత తీవ్ర తరమైంది. సొసైటీలు తక్కువ, రైతుల సంఖ్య ఎక్కువ ఉండటంతో అందరికీ సరైన రీతిలో సరఫరా జరగకపోవడం మరో కారణం.. కలెక్టర్లు పంపిణీ కేంద్రాలను, సొసైటీలను సబ్ సెంటర్‌లుగా క్రియేట్ చేసి లైసెన్సులిచ్చి, ప్రభుత్వ ఉద్యోగులను డిప్యూటేట్ చేస్తే రైతులందరికీ యూరియా అందేది. అన్నింటికి మించి ఒక రైతుకు ఎన్ని బస్తాలు ఇవ్వాలనే దానిపై సీలింగ్ లేకపోవడం. ఈ-పాస్ మిషన్లలో కేవలం వేలిముద్రలు తీసుకోవడం తప్ప రెండోసారి అదే రైతు వస్తే మిషన్‌లలో గుర్తించే సౌలభ్యం లేకపోవడం లోపంగా చెప్పవచ్చును. కేంద్రం నుంచి యూరియా సకాలంలో రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర కావాల్సినంత నిల్వలు లేకపోవడమనేది వాస్తవమే. కానీ ప్రచార మధ్యమాల్లో హైప్ చేయబడినంత కొరత మాత్రం ఉన్నట్లుగా కనిపించడం లేదు. వాస్తవానికి ఇది కృత్రిమంగా క్రియేట్ చేయ బడింది. కొరత అనే భయాన్ని సృష్టించడంతో రైతులు మరింత నిల్వ చేసుకోవాలనే ఆతృతను సోషల్ మీడియా కల్పించింది. దీనికి కారణం అధికారులు అప్రమత్తంగా ఉండకపోవడం, పరిస్థితులకు తగ్గట్టుగా నిర్ణయాలు వెను వెంటనే తీసుకోకపోవడమే. ప్రభుత్వం కూడా ఈ-పాస్ యంత్రాలను అప్‌డేట్ చేయాలి. పౌర సరఫరా శాఖ మాదిరిగా ఒకసారి రేషన్ తీసుకుంటే మళ్లీ రెండోసారి తీసుకోకుండా ఉండే విధంగా, యురియా పంపిణీ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ డిజైన్ చేయాలి. తగినన్ని సబ్ సెంటర్‌లను తెరచి పంపిణీని డిసెంట్రలైజ్ చేయాలి. అధికార యంత్రాంగం చిత శుద్ధితో వ్యవహరిస్తే ఇలాంటి కృత్రిమ కొరత, విష ప్రచారాలను ఎదుర్కోవడం పెద్ద కష్టమైన పనేం కాదు.

## ఏడుగురు సంతకాలు పెట్టేస్తున్నారే

విజయవాడ, సెప్టెంబర్ 24, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు డబుల్ గేమ్ ఆడుతున్నారా? అధినేతకు ఒప్పించుకోలేక సతమతమవుతున్నారా? శాసనసభకు హాజరవుతున్నారా? హాజరైతే సభలో ఎందుకు కనిపించరు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ శపథం చేసిందని.. అప్పట్లో సభకు హాజరు కాలేదని.. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి శపథం చేశారని.. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సభకు వచ్చామని చెప్పి సంతకాలు పెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టడం పై చర్చ ప్రారంభం అయింది. జగన్మోహన్ రెడ్డి మాత్రం తమకు ప్రతిపక్ష హోదా ఇచ్చేవరకు సభకు హాజరు కామంటున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ ప్రకటన పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సంఖ్యా బలంగా ప్రతిపక్ష హోదాకు ఈ సంఖ్య సరిపోదు. అయితే తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు హాజరవుతానని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్తున్నారు. అయితే ప్రతిపక్ష హోదా అనేది తాము ఇచ్చేది కాదని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. కోర్టుకు వెళ్లి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇంకోవైపు వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం సభకు హాజరు కావాలని కోరుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆయన రాజకీయ కారణాలు చెప్పి వారికి చెక్ చెపుతున్నారు. ఇటువంటి తరుణంలో ఏం చేయాలో వైసీపీ ఎమ్మెల్యేలకు పాలు పోవడం లేదు. అందుకే వారు అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళిపోతున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి వారంతా కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే. 11 మంది ఎమ్మెల్యేలు ఏడుగురు కొత్తగా శాసనసభకు ఎన్నికయ్యారు. ఆపై ఆర్థికంగా అంత శ్రీమంతులు కూడా కాదు. సభలో అడుగుపెట్టి అధ్యక్షా అనాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ తమ అధినేత జగన్మోహన్ రెడ్డి మాత్రం తమను అదుపు చేస్తున్నారన్న బాధ వారిలో ఉంది. పోనీ కూటమి పార్టీలోకి జంప్ చేస్తామంటే అటు నుంచి ఆహ్వానాలు లేవు. అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పాటిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం వారిలో ఉంది. ఇంకోవైపు జీతభత్యాలు సైతం కోల్పోతారు. ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పాటించలేక.. సభ లోపలికి వెళ్లలేక.. సంతకాలు పెట్టి వస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు డబుల్ గేమ్ ఆడుతున్నట్లు కూడా స్పష్టం అవుతోంది. కానీ జగన్ మోహన్ రెడ్డి ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఒకసారి శాసనసభ అధికారులకు కానీ.. సిబ్బందిని కానీ సంప్రదిస్తే ఎంతమంది వైసీపీ నేతలు వచ్చి సంతకం పెడుతున్నారు అన్నది తేలిపోనుంది. కానీ జగన్మోహన్ రెడ్డి అంత సాహసం చేయడం లేదు. అలాగని తమ పార్టీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లి సంతకాలు పెడుతున్న విషయం ఆయనకు తెలియదు అని కూడా అనలేము.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ దూరం

విజయవాడ, సెప్టెంబర్ 24, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. మరో మూడు నెలల్లో స్థానిక సంస్థల ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ముందుగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది. తరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది. చివరిగా ప్రాదేశిక ఎన్నికలు పూర్తి చేయాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లకుండా ఎన్నికల సంఘం ఈ నిర్ణయానికి రాదు. మరోవైపు మంత్రి నారా లోకేష్ సైతం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు సొంత నియోజకవర్గాల్లో సమీక్షలు జరిపి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లో వచ్చే మార్చిలోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవుతాయని ఒక అంచనా ఉంది. అయితే ప్రతిపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం ఎటువంటి కదలిక లేదు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అసలు ఉద్దేశం ఏంటి అనేది తెలియడం లేదు.మొన్నటికి మొన్న పులివెందులతో పాటు ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికలు జరిగాయి. పులివెందులలో అయితే కనీసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు రాలేదు. వాస్తవం చెప్పాలంటే ఉప ఎన్నికల తో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటాయి. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. మున్సిపల్ ఎన్నికల సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని అప్పటి టిడిపి ఆరోపించింది. అందుకే అటు తరువాత వచ్చిన ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరించింది. ముందుగా పంచాయితీ సర్పంచ్ ఎన్నికలు జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా గెలుచుకుంది. అదే ఊపుతో మున్సిపల్ ఎన్నికలను కొనసాగించింది. అప్పట్లో ఉన్న వాలంటరీలతో పాటు సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకుంది. వ్యవస్థలన్నీ తన చెప్పు చేతల్లో పెట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో విజయం సాధించిందని టిడిపి ఆరోపించింది. అందుకే ప్రాదేశిక ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా ముందుకు అడుగు వేస్తోంది. కానీ ఇప్పటికీ పార్టీ నాయకులు యాక్టివ్ కాలేదు. స్థానిక నేతలు పెద్దగా క్రియాశీలకంగా లేరు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి విముఖత చూపుతున్నారు. అనవసరంగా పోటీకి దిగి చేతులు కాల్చుకోవడం కంటే దూరంగా ఉండడమే మంచిదన్న నిర్ణయానికి వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సైతం కేంద్ర బలగాల పరిధిలో ఎన్నికలు జరగాలని ప్రకటనలు చేస్తోంది. అప్పుడే ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తారని చెబుతోంది. అయితే కేంద్ర బలగాలు లేకపోతే మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బహిష్కరించే ఉద్దేశం కనిపిస్తోంది. అయితే ఏపీలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దీనిపై ఒక ప్రకటన చేసే పరిస్థితి అయితే మాత్రం కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## ఆదినారాయణ వర్సెస్ సీఎం రమేష్

కడప,సెప్టెంబర్ 24, ఏపీలోకూటమిలో క్రమశిక్షణ కట్టు దాటుతోంది. ముఖ్యంగా రాయలసీమలో పరిస్థితి అదుపు తప్పుతోంది. కడప జిల్లాలో బిజెపి ఎమ్మెల్యే వర్సెస్ బిజెపి ఎంపీ అన్నట్టు పరిస్థితి మారింది. ఏకంగా ఎంపీ కి చెందిన కంపెనీపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గత కొద్ది రోజులుగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నా సఖ్యతగా ఉండడం లేదు. ముఖ్యంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో సీఎం రమేష్ పెత్తనం ఏంటి అని ఆదినారాయణ రెడ్డి వర్గం జీర్ణించుకోలేకపోతోంది. అందుకే ఇప్పుడు దాడులకు దిగినట్లు తెలుస్తోంది. అయితే గతంలోనే ఆదినారాయణ రెడ్డి పై బిజెపి హై కమాండ్ కు సీఎం రమేష్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పుడు ఏకంగా దాడికి దిగడంతో సీఎం రమేష్ సీరియస్ గా తీసుకున్నట్లు తెలుస్తోంది.ఇద్దరిదీ ఒకటే నియోజకవర్గం.. జమ్మలమడుగు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలిచారు ఆదినారాయణ రెడ్డి. అదే సమయంలో అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు సీఎం రమేష్. స్వతహాగా పారిశ్రామికవేత్త. ఆపై సొంత నియోజకవర్గం జమ్మలమడుగులో అదానీ గ్రూపు ఆధ్వర్యంలో ఓ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి.. సబ్ కాంట్రాక్ట్ పొందారు సీఎం రమేష్. ఆయన నేతృత్వంలోని రిత్విక్ కన్స్ట్రక్షన్ సంస్థ 77 కోట్ల రూపాయల టెండర్ దక్కించుకుంది. ఇది ఎంత మాత్రం ఆదినారాయణ రెడ్డి వర్గానికి రుచించలేదు. తాను శాసనసభ్యుడిగా ఉండగా.. ఎంపీ ఎలా దక్కించుకుంటారు అన్నది ఆదినారాయణ రెడ్డి నుంచి వస్తున్న అభ్యంతరమట. అయితే ఇది చినికి చినికి గాలి వానలా మారి ఏకంగా రిత్విక్ కంపెనీ పై దాడి చేసే పరిస్థితి వచ్చింది. ఈ హఠాత్పరిణామంతో రిత్విక్ కంపెనీ ప్రతినిధులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అదే సమయంలో పోలీసులు సైతం చేతులెత్తేశారు. దీనిపై బీజేపీ హై కమాండ్కు మరోసారి ఫిర్యాదు చేసేందుకు సీఎం రమేష్ సిద్ధపడుతున్నారు.

ఆదినారాయణ రెడ్డి తో పాటు సీఎం రమేష్ దిజమ్మలమడుగు నియోజకవర్గమే. తెలుగుదేశం పార్టీలో బలమైన నేతగా ఎదిగారు సీఎం రమేష్. అప్పట్లో టిడిపి ద్వారా రాజ్యసభకు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు ఆదినారాయణ రెడ్డి. అప్పటినుంచి వారిద్దరి మధ్య వైరం నడుస్తోంది. 2014 తర్వాత ఆదినారాయణ రెడ్డి టిడిపిలో చేరారు. అప్పుడు కూడా వారి మధ్య సఖ్యత లేదు. అయితే 2019 ఎన్నికల తరువాత ఆ ఇద్దరు నేతలు బిజెపిలో చేరారు. అయితే సీఎం రమేష్ ఉత్తరాంధ్ర నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. కానీ తనకున్న పలుకుబడి, పరపతితో నిర్మాణరంగంలో కాంట్రాక్టులు దక్కించుకుంటున్నారు.

ఈ క్రమంలోనే జమ్మలమడుగులో పర్యాటక శాఖకు సంబంధించి ఓ నిర్మాణ టెండర్లు దక్కించుకున్నారు. అది ఎంత మాత్రం ఆదినారాయణ రెడ్డి వర్గానికి మింగుడు పడడం లేదు. అందుకే తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే ఈ ఇద్దరి పుణ్యమా అని కూటమి పార్టీల్లో ఐక్యత లోపిస్తోంది. అయితే గతంలో ఆదినారాయణ రెడ్డి ఇదే మాదిరిగా జెసి ప్రభాకర్ రెడ్డి తో పంచాయితీ పెట్టుకున్నారు. చివరకు అది సీఎంవో కార్యాలయం వరకు వెళ్ళింది. కానీ సీఎం రమేష్ తో తలెత్తిన వివాదం మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. చూడాలి బిజెపి హై కమాండ్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో..?

## ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్యే

శ్రీకాకుళం సెప్టెంబర్ 24, ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. మరో 15 ఏళ్ల పాటు కూటమి కొనసాగుతుందని అధినేతలు భావిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే అందుకు విరుద్ధంగా ఉంది. మూడు పార్టీల సమన్వయ లోపం స్పష్టమవుతోంది. ఏకంగా అసెంబ్లీ వేదికగా బిజెపి ఎమ్మెల్యే ఒకరు.. టిడిపి ఎమ్మెల్యే పై ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కుట్రలు చేస్తున్నారని.. వైసీపీ నేతలతో చేతులు కలిపారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి వచ్చింది. కూటమి పార్టీల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పై అసెంబ్లీ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు.శ్రీకాకుళం జిల్లాలో పొత్తులో భాగంగా ఎచ్చెర్ల స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా నడికుదుటి ఈశ్వరరావు పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో క్వారీలు అధికంగా ఉంటాయి. ఈ తరుణంలో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున క్వారీలకు అనుమతులు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆ మరుసటి రోజే ఓ క్వారీ తవ్వకాలకు సంబంధించి వైసీపీ నేతకు భూగర్భ గనుల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. సదరు నేత క్వారీలో గ్రావెల్ తవ్వకాలకు సిద్ధపడగా స్థానికులు అడ్డుకున్నారు. అదే విషయంపై ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన సైతం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్వారీకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. అప్పటినుంచి వివాదం నడుస్తూనే ఉందిఅయితే సదరు క్వారీ యాజమాన్యం నుంచి ఎచ్చర్ల ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. ముడుపులు ఆశిస్తున్నారని.. ఇవ్వకపోవడం వల్లే ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు అంటూ ప్రభుత్వ వ్యతిరేక మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే సదరు క్వారీ యజమాని కి అనుకూలంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యవహరిస్తున్నారు. భూగర్భ గనుల శాఖ అధికారులపై నేరుగా ఒత్తిడి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో రవికుమార్ ప్రమేయంపై విమర్శలు ఉన్నాయి. సదరు క్వారీ యజమాని వైసీపీ నేత అయినా.. రవికుమార్ మద్దతు తెలపడం పై మాత్రం కూటమి పార్టీల నేతల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అయితే ఇటీవల వరుస కథనాలు రావడంతో ఎచ్చర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. సాటి కూటమి ఎమ్మెల్యే తనపై ఇలా వ్యవహరించడం పై ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారుప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా నిన్న జీరో అవర్లో ఎచ్చర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు మాట్లాడారు. తన మనసులో ఉన్న బాధను వ్యక్తపరిచారు. నేరుగా కూన రవికుమార్ పేరు చెప్పకుండా పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే అంటూ సంబోధిస్తూ.. ఆయన తనపై కుట్ర చేశారని.. లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని.. తనకు ఏ సంబంధం లేదని.. దేవుడు పై ప్రమాణం చేస్తున్నాను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలా శ్రీకాకుళం జిల్లాలో కూటమి పార్టీల ఎమ్మెల్యేల మధ్య ఫైట్ తారస్థాయికి చేరడం సంచలనంగా మారింది.

## పార్టీ మారితే కేసులు ఉండవా

ఏలూరు, సెప్టెంబర్ 24, రాజకీయాలు అంతే... రాజకీయాల్లో ఓపిక.. సహనం అవసరం.. అధికారం లేకపోతే పార్టీ మారితే ఎవరూ కేర్ చేయరు. పక్కన ఉండే నలుగురైదుగురు కోటరీ నాయకులు తప్ప ఎవరూ పెద్దగా కలిసేందుకు కూడా ఆసక్తి చూపరు. ప్రస్తుతం మాజీ మంత్రి ఆళ్లనాని పరిస్థితి అలాగే తయారైంది. ఆళ్ల నాని వైసీపీలో ఒక వెలుగు వెలిగారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ఏదో ఒక పదవి పొందారు. అలాగనుకుంటే వైసీపీ అధికారంలోకి రాకముందే ఆళ్లనానిని జగన్ ఎమ్మెల్సీ చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ చీఫ్ జగన్ తన కేబినెట్ లో చోటు కల్పించడమే కాకుండా మొదటి విడతలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా చేశారు. అయితే వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆళ్లనాని వైసీపీని వీడి టీడీపీలో చేరిపోయారు.... తొలి నుంచి ఆళ్ల నాని టీడీపీ చేరికకు ఆ పార్టీ నేతలు అంగీకరించలేదు. ఏలూరు జిల్లా టీడీపీ నేతలు ఆళ్ల నాని పార్టీలో చేరికపై తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో పలు సార్లు ఆయన చేరికకు బ్రేకులు పడినా చివరకు పార్టీ నాయకత్వం ఏలూరు జిల్లా నాయకులకు నచ్చ చెప్పి పార్టీ కండువా కప్పేసింది. సీనియర్ నేతల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ ఆళ్ల నాని పార్టీలో చేరడాన్ని ఇప్పటికీ జీర్ణించుకోవడం లేకపోతున్నారు. అసలు జిల్లాలో ఆళ్లనాని అంటూ ఒక నేత ఉన్నారన్న విషయం ఇటు టీడీపీ నేతలతో పాటు ఆయన అనుచరులు కూడా మర్చిపోయారట. ఏలూరు జిల్లాను ఒకప్పుడు వైసీపీ హయాంలో శాసించిన నాని ఇప్పుడు వేళ్లు విరుచుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. పార్టీలో చేరి ఎనిమిది నెలలు కావస్తున్నా బయటకు రావడం లేదు. చివరకు పార్టీ కార్యక్రమాలకు కూడా ఆళ్లనానికి పిలుపులు లేవు. అసలు ఆళ్లనానిని తమ నాయకుడిగా టీడీపీ నేతలు గుర్తించడం లేదు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమపై పెట్టిన అక్రమ కేసులకు ఆళ్ల నాని ప్రధాన కారణమని భావించడం వల్లనే అంతటి వ్యతిరేకతను టీడీపీ క్యాడర్, లీడర్ల నుంచి ఆళ్ల నాని ఎదుర్కొంటున్నారు. అలాగని నిన్న గాక మొన్న పార్టీలో చేరి స్థానిక నాయకత్వం తీరుపై అధినాయకత్వానికి ఫిర్యాదు చేసే పరిస్థితి కూడా లేదు. దీంతో ఆళ్ల నాని అనవసరంగా పార్టీ మారానా? అన్న బాధలో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఆళ్ల నానికి టీడీపీ టిక్కెట్ దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. దీంతో ఆళ్లనాని మరొకసారి జగన్ కు దగ్గరయ్యే ప్రయత్నాలు కూడా చేస్తున్నారంటున్నారు.

## జనవరి నుంచి 40 వేలు పెరిగిన బంగారం

ముంబై, సెప్టెంబర్ 24, (న్యూస్ పల్స్) బంగారం ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అమెరికా హెచ్-1బీ వీసా రుసుము పెంపుదల ప్రభావం కూడా దీనిపై కనిపిస్తోంది. రూపాయి విలువ మరింత దిగజారడంతో దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర రూ. 2,700 పెరిగి రూ. 1,18,900కు చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి గత మార్కెట్ సెషన్‌లో పది గ్రాములకు రూ. 1,16,200 వద్ద ముగిసింది.అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం వల్లనే బంగారం ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత క్యాలెండర్ ఏడాదిలో బంగారం ధర 10 గ్రాములకు రూ. 39,950 పెరిగింది. గతేడాది డిసెంబర్ 31 బంగారం ధర రూ. 78,950 వద్ద ముగిసిన విషయం తెలిసిందే.వెండి ధరలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. కిలో వెండి రూ. 3,220 పెరిగి రూ. 1,39,600కు చేరి, సరికొత్త గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. ఈ క్యాలెండర్ ఏడాదిలో వెండి ధర ఏకంగా రూ.49,900 పెరిగింది. డిసెంబర్ 31న వెండి ధర రూ. 89,700గా ఉంది. మరోవైపు, డాలర్ మారకంతో రూపాయి మంగళవారం 47 పైసలు క్షీణించి 88.75కు పడిపోయింది.పసిడి పరుగులు ఒక్క రోజులోనే రూ. 2 వేలు పెరగడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దీపావళి నాటికి బంగారం ధరలు భారీగా పెరుగుతాయని అంతా అనుకుంటే, దానికి ముందే ధరలు ఈ స్థాయికి చేరుకోవడం అందరికీ ఆందోళనకు గురిచేస్తోంది. బంగారం ధరలు పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్నటువంటి పరిస్థితులే కారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి పెరిగిన ధరలు ఇబ్బందికరంగా ఉన్నాయనే చెప్పాలి.

# వైసీపీలో నెంబర్ 2 రచ్చ

తిరుపతి,సెప్టెంబర్ 24, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్ తరువాత ఎవరు? అధినేత తరువాత స్థానం ఎవరిది? జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచేది ఎవరు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైసిపి ఆవిర్భావం నుంచి జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఒక వలయం పనిచేసింది. విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.. ఇలా ఒక రక్షణ వలయం ఉండేది. కానీ ఇప్పుడు కొందరు నేతలు పార్టీకి దూరమయ్యారు. మరికొందరు కేసుల్లో చిక్కుకొని జైలు పాలు అయ్యారు. ఈ క్రమంలో జగన్మోహన్ రెడ్డి ఒంటరి అయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి వారు ఉన్నా.. జగన్మోహన్ రెడ్డి సొంత మనుషులకు నియమించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మారిన రాజకీయ పరిస్థితులు, ముసురుకొస్తున్న కేసులు దృష్ట్యా జగన్మోహన్ రెడ్డి ముందు ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తన భార్య భారతి రెడ్డిని రాజకీయాల్లోకి తేవాలని.. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు ఎవరు రాజకీయాల్లోకి రాలేదు. ముఖ్యంగా కుటుంబంలో మహిళలు రాజకీయాలకు దూరంగా ఉండేవారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో.. జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడేందుకు ముందుకు వచ్చారు తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల. కొడుకు కోసం పులివెందులలో పోటీ చేశారు విజయమ్మ. కాంగ్రెస్ అధినాయకత్వంతో విభేదించి మరి రంగంలోకి దిగారు. చెల్లెలు షర్మిల అయితే ఊరు వాడ ప్రచారం చేశారు. అన్న జగన్మోహన్ రెడ్డి కోసం ఏకంగా పాదయాత్ర చేశారు. తన అన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు పరితపించారు. కానీ ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డికి తల్లి, చెల్లి ఇద్దరూ దూరమయ్యారు.జగన్మోహన్ రెడ్డితో సుదీర్ఘకాలం ప్రయాణం చేశారు విజయసాయిరెడ్డి. రాజకీయాల్లోకి రాకమునుపే జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగించేవారు. ఈ క్రమంలోనే జగన్ అవినీతి కేసుల్లో విజయసాయిరెడ్డి కూడా 16 నెలలు పాటు జైల్లో ఉండి పోయారు. వైసిపి ఆవిర్భావంలో విజయసాయిరెడ్డి పాత్ర కీలకం. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అన్ని విధాల కృషి చేశారు విజయసాయిరెడ్డి. జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరిచే క్రమంలో విజయసాయిరెడ్డి చేసే కృషి అంతా అంతా కాదు. అటువంటి విజయసాయిరెడ్డి ఇప్పుడు పార్టీకి గుడ్ బై చెప్పారు. మరోవైపు బాబాయ్ వైవి సుబ్బారెడ్డి యాక్టివ్ గా లేరు. పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సైతం అరెస్ట్ అవుతారని ప్రచారం నడుస్తోంది. ఇటువంటి సంక్లిష్ట సమయం కొనసాగుతున్న నేపథ్యంలో.. తనకు అండదండగా నిలిచేందుకు తన భార్య భారతి రెడ్డిని జగన్ రంగంలోకి దించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారతి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో తరచూ ఫోన్లో మాట్లాడుతూ పార్టీ స్థితిగతులను తెలుసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# సూర్యరావు వర్సెస్ అమూల్య

రాజమండ్రి, సెప్టెంబర్ 24, అన్నా చెల్లెళ్ల మాటల యుద్ధం, అన్నా దమ్ముళ్ల మధ్య మాటల తూటాలు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పటికీ హాట్ టాపిక్ అవుతుంటాయి. సంచలనం.. ఎందుకంటే ఏపీలో అన్నా చెల్లి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిలా రెడ్డి రాజకీయ ప్రత్యర్థులుగా మారితే.. తెలంగాణాలో కేటీఆర్, కవిత ల మధ్య ఎటువంటి పొలిటికల్ వాతావరణం నెలకొందో చెప్పనక్కర్లేదు. ఇటువంటి పరిణామాలు కేవలం ముఖ్యమంత్రి స్థాయి కుటుంబాల్లోనే అనుకుంటే పొరపాటే... ఏపీలోని ఓ మాజీ మంత్రి ఇంట్లోనూ తండ్రి, కూతురు మధ్య ఓ చిన్నపాటి యుద్ధ వాతావరణమే నెలకొంది.. దీనికి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గం వేదికగా మారింది.. మాజీ మంత్రి, వైసీపీ నేత గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్య కు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడం హాట్ టాపిక్ అవుతోంది. పొలిటికల్ తెరమీద తండ్రి వర్సెస్ కూతురు కథ అందరి దృష్టిలో ఆసక్తిని నెలకొల్పింది.. రాష్ట్ర విభజన, నియోజకవర్గాల పునర్విభజనకు ముందు అల్లవరం ఎస్సీ కానిస్టెన్సీ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి తొలిసారిగా ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి సూర్యారావు 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి గెలుపొంది వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినేట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు.. ఆతరువాత కాంగ్రెస్ పార్టీకు రాజినామా చేసి మళ్లీ టీడీపీలో చేరి 2014 ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు.. 2019లో టీడీపీ తరపున పోటీచేసి ఓటమి చెంది 2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకుని రాజోలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు.. ప్రస్తుతం ఆయన రాజోలు నియోజవకవర్గ వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాద్యతలు నిర్వర్తిస్తున్నారు.. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధిష్టానం గొల్లపల్లి సూర్యారావుకు షాక్ నిచ్చే ప్రకటన విడుదల చేసింది.. టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇంచార్జ్ బాద్యతలను గొల్లపల్లి కుమార్తె గొల్లపల్లి అమూల్యకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.. దీంతో రాజోలు రాజకీయం రసవత్తరంగా మారింది.. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన క్రమంలో గొల్లపల్లి సూర్యారావు కుటుంబం కూడా రాజోలు నియోజకవర్గంలో ఆయనకు సహకారంగా ప్రచారం చేసింది.. ఈక్రమంలోనే గొల్లపల్లి అమూల్య రాజోలు నియోజకవర్గంలో 2014 నుంచి 2024 వరకు రాజోలు టీడీపీ నాయకులతో, కార్యకర్తలతో పరిచయాలు పెంచుకోవడమే కాదు.. ఏకంగా గత అయిదేళ్లుగా నియోజవర్గ పరిధిలోని జగ్గన్నపేటలో నివాసం ఉంటోంది.. ఈక్రమంలోనే 2024 ఎన్నికల్లో టీడీపీ తరపున తాను బరిలో ఉన్నానంటూ టిక్కెట్టు కోసం దరఖాస్తు చేసుకోవడంతో కుటుంబంలో వివాదం మొదలయ్యింది. గొల్లపల్లి సూర్యారావు, ఆయన కుమారుడు శ్రీధర్‌లు అమూల్యను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు ప్రచారం జరిగింది.ఒక దశలో రాజోలు టిక్కెట్టు అమూల్యకే ఇస్తున్నారంటూ ప్రచారం కూడా జరిగింది.. అయితే అనూహ్యంగా జనసేన తరపున జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో అత్యంత సన్నిహితంగా ఉండే మాజీ ఐఎఎస్ అధికారి దేవా వరప్రసాదరావు సీన్‌లోకి ఎంట్రీ ఇవ్వడంతో రాజోలు స్థానం జనసేన ఎగరేసుకుపోయింది.. ఈక్రమంలో అయోమయంలో పడిన గొల్లపల్లి సూర్యారావు వైసీపీ ఇచ్చిన ఆఫర్‌ను స్వీకరించి రాజోలు నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఆయన కుమార్తె గొల్లపల్లి అమూల్య మాత్రం టీడీపీలోనే కొనసాగుతూ చురుగ్గా వ్యవహరించింది.. దీంతో పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొంది ఇప్పుడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థాయిని అందుకున్నారు.. రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తుండగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా గొల్లపల్లి సూర్యారావు ఉన్నారు. మధ్యలో వైసీపీకు పూర్తి ఆపోజిట్ పార్టీగా ఉన్న టీడీపీ నుంచి ఆయన కుమార్తె అమూల్య ఉండడం వైసీపీకు కొరకరాని కొయ్యలా మరిందంటున్నారు.. ఐవీఆర్ ఎస్ ద్వారా నియోజకవర్గంలో అభిప్రాయ సేకరణ చేపట్టిన టీడీపీ అధిష్టానంకు అమూల్య కు మద్దతు తెలుపుతూ 70 శాతంకు పైగా తమ అంగీకారం తెలిపారని తెలుస్తోంది.. పైగా పార్టీ బలోపేతంకు కృషిచేస్తూనే ప్రభుత్వం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనసేన ఎమ్మెల్యే వరప్రసాదరావుతో కలిసి పనిచేస్తానని అమూల్య ప్రకటించారు. దీంతో రాజోలు నియోజకవర్గంలో తండ్రీకూతుర్ల మధ్య మాటల యుద్ధం ఏస్థాయిలో ఉంటుందో అంటూ చర్చించుకుంటున్న పరిస్థితి

# మహిళలకు మోడీ మరో గిఫ్ట్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24, దేవి నవరాత్రి పండుగ సందర్భంగా కేంద్రం మహిళలకు ఒక ముఖ్యమైన బహుమతిని ప్రకటించింది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద 25 లక్షల అదనపు ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఆమోదించింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉజ్వల యోజన లబ్ధిదారుల సంఖ్య 105.8 మిలియన్లకు చేరుకుంటుందని పెట్రోలియం ? సహజ వాయువు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ పథకం కింద 2.5 మిలియన్ల డిపాజిట్ రహిత కనెక్షన్ల కోసం ప్రభుత్వం మొత్తం రూ.676 కోట్ల ఖర్చును ఆమోదించింది. ఇందులో కనెక్షన్‌కు రూ.2,050 చొప్పున రూ.512.5 కోట్లు అలాగే సబ్సిడీ కోసం రూ.160 కోట్లు కేటాయించారు. ఒక 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌కు రూ.300 సబ్సిడీ, సంవత్సరానికి గరిష్టంగా తొమ్మిది సిలిండర్ల వరకు వర్తిస్తుంది.ఈ పథకం కింద ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ సిలిండర్, ప్రెజర్ రెగ్యులేటర్, సేఫ్టీ గొట్టం, కన్స్యూమర్ కార్డ్, ఇన్‌స్టాలేషన్ ఛార్జీల ఖర్చును భరిస్తాయి. మొదటి రీఫిల్ ? స్టవ్ కూడా ఉచితంగా అందిస్తారు.అర్హత ఉన్న మహిళలు ఒక సరళమైన కేవైసీ ఫామ్.. డిప్రివేషన్ డిక్లరేషన్ ను ఆన్‌లైన్‌లో లేదా సమీపంలోని ఏదైనా ప్రభుత్వరంగ ఒఖఉ ఏజెన్సీలో అందజేయాలి. అప్లికేషన్ ధృవీకరణ తర్వాత కనెక్షన్లు జారీ చేస్తారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు సవరించిన ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.ఈ పథకం మే 2016లో ప్రారంభమైంది. మొదటి దశలో 80 మిలియన్ల కనెక్షన్ల లక్ష్యం సెప్టెంబర్ 2019లో పూర్తయ్యింది. ఆ తర్వాత ఉజ్వల 2.0 ఆగస్టు 2021లో ప్రారంభమై జనవరి 2022 నాటికి అదనంగా 10 మిలియన్ కనెక్షన్లు జారీ చేశారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవరాత్రి సందర్భంగా 2.5 మిలియన్ల అదనపు కనెక్షన్లను విడుదల చేయడం మహిళల గౌరవానికి ప్రాధాన్యత ఇస్తుందని.. ఇది దుర్గాదేవి వంటి మహిళలను గౌరవించాలనే ప్రధాని మోదీ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. ఉజ్వల పథకం మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, కుటుంబాల భవిష్యత్తును మెరుగుపరచడంలో చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించిందని ఆయన అన్నారు.

## పార్వతి దేవి అలంకారంలో శ్రీ ఉమాదేవి

రాయచోటి, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి పట్టణంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి బుధవారంరాయచోటి పట్టణం ఎస్ఎన్ కాలనీ చెక్పోస్ట్ శివాలయం వద్ద వెలిసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు శ్రీ ఉమాదేవి అమ్మవారికి ప్రధాన అర్చకులు నటరాజస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పార్వతి దేవి రూపంలో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయ కమిటీ పర్యవేక్షకులు అరమాటి శివగంగ రెడ్డి. ఈ సందర్భంగా శివ గంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది కూడా ఆలయంలో దసరా శరన్న రాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ఇడ్లీ, దోశెపై జీఎస్టీ వద్దు



చెన్నై, సెప్టెంబర్ 24, (న్యూస్ పల్స్) గతంలో అనేక స్లాబులున్న జిఎస్టి లో సరళీకృతం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేవలం రెండు స్లాబులు మాత్రమే ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. అది నిన్నటి నుంచి అమల్లోకి వచ్చింది. ఇది దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని.. పన్ను విధానంలో సరికొత్త చరిత్రకు నాంది పలుకుతుందని మోడీ ప్రకటించారు. ప్రజల జీవన విధానంలో కూడా మార్పు వస్తుందని.. ప్రజల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ జీఎస్టీ విధానంలో మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో నిరసనకు కారణమవుతోంది.దక్షిణాది రాష్ట్రాలలో కర్ణాటకలో కాంగ్రెస్, తెలంగాణలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్లో కూటమి, తమిళనాడులో డిఎంకె, కేరళలో వామపక్ష పార్టీ అధికారంలో ఉన్నాయి. కర్ణాటక మినహా మిగతా రాష్ట్రాలలో బిజెపి ఇంతవరకు సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్నప్పటికీ అవి అంతగా ఫలప్రదం కావడం లేదు. దక్షిణాది రాష్ట్రాల ప్రజల అవసరాలు ఏమిటో.. ఏ విధంగా అయితే వారు ఆదరిస్తారో ఇప్పటివరకు బిజెపికి ఒక దిశ అంటూ లేకుండా పోయింది. పైగా నాయకత్వం మార్పులను ఎప్పటికప్పుడు చేపడుతూ ఉండడం ఇక్కడి రాష్ట్రాలలో బిజెపికి దెబ్బగా మారింది. అటువంటి వాటి నుంచి గుణ పాఠాలు నేర్చుకోకపోగా.. మరింత పనికిమాలిన నిర్ణయాలను బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్నది. అది అంతిమంగా ఇక్కడ ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోంది.కేంద్ర ప్రభుత్వం తాజాగా జిఎస్టి విషయంలో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ దక్షిణాది ప్రజలు ఇష్టంగా తినే ఇడ్లీ, దోశలపై జీఎస్టీ విధానాన్ని యధావిధిగా ఉంచడం పట్ల నిరసన వ్యక్తం అవుతుంది. ఉత్తరాది రాష్ట్రాలలో తినే చపాతి, పరోటా పై జిఎస్టి లేకుండా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలలో ప్రజలు ఇష్టంగా తినే ఇడ్లీ, దోశలపై ఐదు శాతం జిఎస్టి విధానాన్ని అమలు చేయడం పట్ల ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర రాష్ట్రాలలోని ప్రజల తినే అల్పాహారాలపై పన్ను తొలగించి.. ఇక్కడి ప్రజలు తినే వంటకాలపై వివక్ష చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయాన్ని ఏపీ శాసనసభలో ఎమ్మెల్యే రామకృష్ణ ప్రస్తావించారు. అయితే దానిపై కూటమినేతలు ఎటువంటి మాటలు మాట్లాడలేదు. మరోవైపు కొందరు దక్షిణాది వంటకాలపై కేంద్రం కక్ష కట్టిందని.. జీఎస్టీతో ప్రజల తినే ఆహారంపై కూడా ఉక్కు పాదం మోపుతోందని ఆరోపిస్తున్నారు. కేంద్రం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# అమెరికా వద్దంటోంది.. ఐదు దేశాలు... రా రమ్మంటున్నాయ్

ముంబై, సెప్టెంబర్ 24, (న్యూస్ పల్స్) అమెరికాలో ఉద్యోగం సాధించి స్థిరపడాలనే ఎందరో భారతీయ నిపుణుల ఆశలకు ట్రంప్ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధన గట్టి దెబ్బ కొట్టింది. హెచ్–1బీ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ఏకంగా లక్ష డాలర్లు (సుమారు 88 లక్షల రూపాయలు) ఫీజుగా చెల్లించాలన్న నిబంధన ఇప్పుడు పెను సవాలుగా మారింది. దీంతో అమెరికాలో ఉద్యోగం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారడంతో, నైపుణ్యం కలిగిన భారతీయులు ఇతర దేశాల వైపు చూస్తున్నారు. మెరుగైన అవకాశాలు, సులభమైన వీసా నిబంధనలు అందిస్తున్న పలు దేశాలు వారికి ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి.ప్రస్తుతం భారతీయ నిపుణులకు అత్యంత ఆకర్షణీయమైన దేశంగా కెనడా నిలుస్తోంది. అక్కడి ఫెడరల్ స్కిల్డ్ వర్కర్ ప్రోగ్రామ్ ద్వారా విదేశీ నిపుణులు సులభంగా వర్క్ వీసా పొందవచ్చు. ముఖ్యంగా ఐటీ రంగంలో విస్తృత అవకాశాలు ఉండటం, శాశ్వత నివాసం (పీఆర్) ప్రక్రియ కూడా సులభతరం కావడంతో చాలామంది కెనడాను ఎంచుకుంటున్నారు.యూరప్‌లో ఆర్థికశక్తిగా పేరొందిన జర్మనీ కూడా నిపుణులకు మంచి గమ్యస్థానంగా ఉంది. ముఖ్యంగా తయారీ, ఇంజినీరింగ్ రంగాల్లో ఇక్కడ ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయి. జాబ్ సీకర్ వీసాతో ఆరు నెలల పాటు అక్కడే ఉండి ఉద్యోగం వెతుక్కునే సౌలభ్యం ఉంది. ఉద్యోగం లభించగానే దాన్ని వర్క్ పర్మిట్‌గా మార్చుకోవచ్చు. యూరోపియన్ యూనియన్ బ్లూ కార్డ్ ప్రోగ్రామ్ కూడా జర్మనీలో పనిచేయడానికి మార్గం సుగమం చేస్తోంది.ఆసియాలోనే మంచి అవకాశాలు కోరుకునే వారికి సింగపూర్ సరైన ఎంపిక. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), బ్యాంకింగ్, మార్కెటింగ్ రంగాల్లో నైపుణ్యం ఉన్నవారికి 'ఎంప్లాయ్‌మెంట్ పాస్ (ఈపీ)' ద్వారా వీసా ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. ఇక్కడ జీతాలు కూడా చాలా ఆకర్షణీయంగా ఉండటం మరో ప్రత్యేకత.మధ్యప్రాచ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) భారతీయులకు మరో గొప్ప అవకాశం. ఇక్కడ వీసా ప్రక్రియ చాలా సులభం, పైగా ఆదాయపు పన్ను లేకపోవడం అతిపెద్ద ప్రయోజనం. ఐటీ, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, నిర్మాణ రంగాల్లో ఉద్యోగాలు అధికం. భారతదేశానికి దగ్గరగా ఉండటం, పన్ను రహిత జీతం వంటి కారణాలతో యూఏఈ వైపు మొగ్గు చూపుతున్నారు.అదేవిధంగా, ఆస్ట్రేలియా కూడా మెరుగైన జీవన ప్రమాణాలు, అనుకూలమైన పని వాతావరణంతో నిపుణులను ఆకర్షిస్తోంది. జనరల్ స్కిల్డ్ మైగ్రేషన్ (జీఎస్ఎం) ప్రోగ్రామ్ ద్వారా నైపుణ్యం కలిగిన వారికి మార్గం సులభం. ఐటీ, ఇంజినీరింగ్, హెల్త్‌కేర్, విద్య వంటి రంగాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. మొత్తంగా, అమెరికా కొత్త నిబంధనల నేపథ్యంలో భారత నిపుణులు తమ కెరీర్ ప్రణాళికలను మార్చుకుంటూ, స్వాగతం పలుకుతున్న ఇతర దేశాల్లో తమ భవిష్యత్తును వెతుక్కుంటున్నారు.

ప్రయాణం...భారమే

మెరికా అధ్యక్షుడు భారత్ తమ మిత్ర దేశం, నరేంద్రమయోదీ తన మిత్రుడు అంటూనే దెబ్బమీద దెబ్బ కొడుతున్నాడు. ఇప్పటికే టారిఫ్‌లు విధించారు. తాజాగా హెచ్?1బీ వీసాలో లాటరీ సిస్టం రద్దు చేశారు. అమెరికా వెళ్లేవారు లక్ష డాలర్లు చెల్లించాలని నిబంధన విధించారు. తాజాగా అమెరికా విమాన ప్రయాణ చార్జీలు కూడా పెంచేశారు. అమెరికా నుంచి ఇండియాకు విమాన ప్రయాణం ఎప్పుడూ ఆసక్తికరం, కానీ ధరలు సీజన్, బుకింగ్ సమయం, ఎయిర్‌లైన్ మీద ఆధారపడి మారతాయి.2025 సెప్టెంబర్?అక్టోబర్ మధ్య ?ఇఅమెరికా నుంచి ఇండియాకు రౌండ్?ట్రిప్ టికెట్లు సగటున 500 నుంచి 800 డాలర్ల మధ్య ఉన్నాయి. ఒక్కో వై టికెట్లు 300 నుంచి 400 నుండి మొదలవుతాయి. డల్లాస్ నుండి ఇండియాకు ధరలు 495?670 (సెప్టెంబర్ 20, 2025 డేటా). ఇదే డల్లాస్ టు ఇండియా (2 రోజుల క్రితం) రూ.49,500 నుంచి రూ.60 వేలు. న్యూయార్క్ టు ముంబై 584 (కువైట్ ఎయిర్‌వేస్, అక్టోబర్ 7?14). వాషింగ్టన్ టు ఢిల్లీ రూ.339 నుంచి (ఎయిర్ ఇండియా, ఒక్కో వై). ఆఫ్?పీక్ సీజన్ (సెప్టెంబర్)లో ధరలు తక్కువగా ఉంటాయి, అయితే పీక్ సీజన్ (డిసెంబర్)లో 1,300 డాలర్ల వరకు పెరుగుతాయి. ఇండియా నుండి అమెరికాకు వెనక్కి వస్తే, టికెట్లు రూ41 వేలు(490 డాలర్లు) నుంచి?మొదలవుతాయి. డల్లాస్ ధరలు గత రెండు రోజుల్లో స్థిరంగా ఉన్నాయి, కానీ డిమాండ్‌తో మారే అవకాశం ఉంది.

ఈ ఏడాది ధరల ట్రెండ్స్..

ఫ్లైట్ ధరలు సీజన్, ఫెస్టివల్స్, వీకేడేస్‌పై ఆధారపడతాయి. 2025 ట్రెండ్స్ సెప్టెంబర్ (495?777) డాలర్లు, జనవరి, ఫిబ్రవరి (20% తక్కువ). డల్లాస్ నుండి ఇప్పుడు 495?670 డాలర్ల రేంజ్‌లో ఉంది. డిసెంబర్ (1,347 డాలర్లు సగటు), సమ్మర్, ఫెస్టివల్స్ (దీపావళి, హోలీ). డల్లాస్ ధరలు డిసెంబర్‌లో రూ.75,000 (900 డాలర్ల) వరకు పెరిగే అవకాశం. మంగళవారం, బుధవారం ఫ్లైట్స్ 20% చౌక. డల్లాస్ నుండి వీకెండ్ టికెట్లు 50? 100 డాలర్లు ఎక్కువ. గూగుల్ ఫ్లైట్స్ ప్రకారం, ధరలు టేకాఫ్‌కు ముందు 45 సార్లు మారతాయి. డల్లాస్ ధరలు రెండు రోజుల క్రితం రూ.49,500? రూ.60 వేలు నుంచి స్థిరంగా 590? 715 డాలర్ల రేంజ్‌లో ఉన్నాయి. 2025లో ఫ్లైట్ ధరలు 2?3% పెరిగే అవకాశం.

## పత్తి కొనుగోలుకు సీసీఐ యాప్

అదిలాబాద్, సెప్టెంబర్ 24, రైతులు పత్తి అమ్ముకోవాలంటే మధ్యవర్తుల దోపిడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటివాటికి చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త యాప్ విధానం తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ సీజన్ రైతులు పంట అమ్ముకునేదుకు తమ వివరాలు, పంట సాగుకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేయాలి.ఇలా చేయడం ద్వారా సెంటర్ల వద్ద రైతుల రద్దీని కంట్రోల్ చేయడమే కాకుండా.. అక్రమాలను అడ్డుకోవచ్చని సీసీఐ అనుకుంటోంది. కపాస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత రైతు పేరు, జండర్, డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్, అడ్రస్, ఆధార్, మె?బైల్ నంబర్, అడ్రస్‌తో రిజిస్టర్ అవ్వాలి. అనంతరం ఏ మార్కెట్‌లో పత్తి అమ్మాలనుకుంటున్నారో ఆ వివరాలు ఎంటర్ చేయాలి.అంతేకాదు భూమి సొంతమా, కౌలుదారా చెప్పాలి. పట్టాదారు పాస్ బుక్ నెంబర్, సర్వే నెంబర్, కౌలత రకం, రైతుకు ఉన్న మె?త్తం భూమి, పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం లాంటి వివరాలు ఇవ్వాలి. రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్, రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటితో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేయాలి. మార్కెట్, తేదీ, టైమ్‌లోనే రైతుకు సంబంధించిన పత్తి కొనుగోళ్లను అనుమతి ఇస్తారు. సెంటర్ల వద్ద రైతులు వెయిట్ చేయాల్సిన పరిస్థితి తప్పుతుంది. స్మార్ట్‌ఫోన్, వ్యవసాయ అధికారుల వద్ద స్లాట్ బుక్ చేసుకోవచ్చు.పారదర్శకంగా పత్తి సేకరణ, మధ్యవర్తులను అరికట్టడానికి, రైతుల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించడానికి సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేసి, తరువాత దానిని సీసీఐకి కనీస మద్దతు ధరకు విక్రయించారు. ఇప్పుడు కార్పొరేషన్ ఈ పద్ధతిని అరికట్టాలని యోచిస్తోందిమెదక్ జిల్లాలోని ఎంపిక చేసిన కొనుగోలు కేంద్రాలలో యాప్ ఆధారిత సేకరణను పైలట్ ప్రాతిపదికన ప్రవేశపెడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం 4.93 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.50 లక్షల ఎకరాలు సాగు చేశారు. సిద్దిపేటలో రైతులు 1.08 లక్షల ఎకరాల్లో, మెదక్‌లో కేవలం 35,000 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తోంది.

# బతుకమ్మ చీరల పంపిణీకి సర్వం సిద్ధం

నిజామాబాద్, సెప్టెంబర్ 24,బతుకమ్మ చీరల పంపిణీకి సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జీ) సభ్యులకు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చీరలను రేవంతన్న కానుకగా అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు సంవత్సరానికి రెండు చీరల చొప్పున పంపిణీ చేయాలని ప్రభుత్వం భావించింది.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను పురస్కరించుకొని 18 సంవత్సరాలు నిండిన, తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేసిన విషయం విధితమే. గత ప్రభుత్వం రేషన్ కార్డులో పేరున్న ప్రతీ మహిళకు రేషన్ డీలర్ల ద్వారా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ పథకం కింద అందించిన చీరలు నాణ్యతగా లేవని మహిళలు వీటిని ధరించడం లేదని భావించి కాంగ్రెస్ ప్రభుత్వం గత బతుకమ్మ పండగకు చీరల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేసింది.దీంతో ప్రభుత్వంపై మహిళల కొంత వ్యతిరేకత వస్తుందని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ఈ పథకాన్ని ఈ ఏడాది కొన సాగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరెలు అందించడం ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా ఈ పంపిణీ ప్రక్రియను చేపట్టింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చీరెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.అక్కాచెల్లెళ్లకు మా రేవంతన్న కానుక పేరిట చేనేత చీరలను ఇందిరా మహిళ శక్తి పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే డ్రెస్ కోడ్ లో భాగంగా వారికి దసరా పండును పురస్కరించుకొని రెండేసి చీరెలను పంపిణీ చేయాలని నిర్ణ యించింది. నాణ్యత విషయంలో ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది.చీరల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చీరెలను జిల్లాలోని మండలాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో విడతల వారీగా చీరెలు రానున్నాయి. అయితే చీరెలను ఎక్కడ భద్రత పరిచేది స్టాక్ పాయింట్ల వివరాలను ప్రభుత్వం ముందే తెప్పించుకుంది.జిల్లాలోని 7 మండల సమాఖ్యలను చీరలను నిల్వ చేసేందుకు ఎంపిక చేశారు. ఇక్కడి నుంచి మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలిస్తారు. మండలాల్లో చీరలను నిల్వ చేసే స్టాక్ పాయింట్లను ఇప్పటికే గుర్తించారు. ఇక్కడి నుంచి గ్రామాల వారీగా ఎస్ హెచ్ జీ సభ్యులకు అందించనున్నారు. గతంలో రేషన్ కార్డు ఆధారంగా అందించగా ప్రస్తుతం స్వశక్తి సభ్యుల వారీగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో 2 లక్షల కు పైగా మహిళా సంఘాల సభ్యులు..

ఇప్పటికే జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఎన్ని సంఘాలు ఉన్నా యి.? ఎంత మంది సభ్యులు ఉన్నారు.? అనే లెక్కలు తీశారు. అంతే గాకుండా మెప్మా సిబ్బందికి పంపిణీ బాధ్యతలను అప్పగించారు. కామారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,79,417 మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో 24,272 మంది సభ్యులు ఉన్నారు. మొత్తం 2,03,689 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.వీరందరికి చీరల పంపిణీ జరగనుంది. డ్రెస్ కోడ్ లో భాగంగా అన్నీ ఒకే రంగుతో ఒకే విధంగా ఉంటాయి. మహిళా సంఘాల సభ్యులకు సంవత్సరానికి రెండేసీ చీరలు పంపిణీ చేస్తారు. కానీ ఈ సారి మాత్రం ప్రస్తుతం ఒక చీర నే పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళా సంఘాలకు చీరలను ఇవ్వడం ఇదే మొదటి సారి. గత సంవత్సరం ఇవ్వలేదుఅంతకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేసేది. మెప్మా సభ్యులకు కూడా చీరెలను పంపిణీ చేస్తారు. మహిళకు రెండు రకాల చీరలను అందిస్తుండగా ఇందులో ఆరున్నర మీటర్ల చీరలు, 9 మీటర్ల చీరలు ఉంటాయి. చీరల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించనున్న చీరలు చేనేతవి కావడమే కాకుండా చాలా మన్నికగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఒక్కోక్క చీర సుమారు రూ. 800 విలువ ఉంటుందని చెబుతున్నారు.ఎస్ హెచ్ జీ సభ్యులకు పంపిణీ చేసే చీరెలను రాష్ట్రంలోని వరంగల్ జిల్లాతో పాటు కరీనగర్, సిరిసిల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో తయారు చేయించారు. టెస్కో పెట్టిన ఆర్డర్ ప్రకారం ఆ సంస్థ ఇచ్చిన డిజైన్, రంగుల మేరకే చీరలను నేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ఎంపిక చేసిన డిజైన్లలో చీరలు తయారయ్యాయి. మహిళలకు ప్రభుత్వం బతుకమ్మ చీరలను రేవంతన్న కానుకగా అందించేందుకు ఏర్పాట్లు చేయడంతో స్వయం సహాయక సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రియల్ రంగంలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24, హైదరాబాద్ అంటే ఒకప్పుడు చార్మినార్ మాత్రమే గుర్తుకు వచ్చేది. ఆ తర్వాత ట్యాంక్ బండ్.. బుద్ధుడి విగ్రహం.. ఇలా రకరకాల ఐకానిక్ సింబల్స్ వచ్చేసాయి. ఇప్పుడైతే దుర్గం చెరువు వంతెన.. పెద్దపెద్ద ఆకాశ హర్మ్యాలు సరి కొత్తగా చోటుచేసుకున్నాయి. మై హోం, తాజాగా అరబిందో ఇవన్నీ కూడా రియల్ ఎస్టేట్ బిజినెస్ లో సరికొత్త బెంచ్ మార్క్ సృష్టిస్తున్నాయి. పెద్దపెద్ద అపార్ట్మెంట్స్ కట్టి.. వాటిలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించి దుమ్మురేపే రేంజ్ లో విక్రయిస్తున్నాయి. తెలంగాణలో ప్రతిపక్ష స్థానంలో ఉన్న పార్టీ హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ డౌన్ అయిందని గగ్గోలు పెడుతుంది. కానీ అందులో ఏమాత్రం వాస్తవం లేదు. ఎందుకంటే అరబిందో ఫార్మా కట్టిన కోహినూర్ అపార్ట్మెంట్స్ లో ఒక్క ఫ్లాట్ విలువ దాదాపు 6 కోట్లు.. దాని పక్కనే యశోద హైటెక్ సిటీ బ్రాంచ్ ఉంటుంది. కోహినూర్ అపార్ట్మెంట్లోని 25వ అంతస్తుకు వెళ్లి చూస్తే హైదరాబాదు నగరం మొత్తం సగం కనిపిస్తూ ఉంటుంది.ఒకప్పుడు ముంబై, గుర్గావ్, నోయిడా ప్రాంతాల్లోనే అపార్ట్మెంట్లకు బీభత్సంగా రేట్లు ఉండేవి. ఇప్పుడు అవన్నీ కూడా హైదరాబాద్ ముందు జుజుబి అయిపోయాయి. చివరికి అంతటి ట్రంప్ కూడా హైదరాబాదులోనే రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు అంటే ఏ స్థాయిలో డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.. విస్తారంగా భూములు.. నడ మంత్రపు సిరికి సంకేతంగా కొత్త కొత్త ఉద్యోగాలు.. అంతకుమించి అనే విధంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు.. ఇవన్నీ కలగలిసి హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని సరికొత్త వైపుగా తీసుకెళ్తున్నాయి. ఇది ఎంతవరకు వెళు తుంది.. ఎక్కడి వరకు దారి తీస్తుంది.. ఇంకా ఏ స్థాయిలో పెరుగుతుందనేది ఎవరూ చెప్పలేరు.వాస్తవానికి ఇంతటి ఖరీదైన ఆకాశ హర్మ్యాలలో పెద్ద పెద్ద వాళ్ళు ఉంటారు. కోట్లకు పడగలెత్తిన వారు నివాసం ఉంటారు. కానీ అందులో పాత్రికేయులకు స్థానం ఉంటుందా? ఈ ప్రశ్నకు ఉంటుందనే సమాధానమే వస్తోంది. ఎందుకంటే ఇటీవల కాలంలో పాత్రికేయులు కూడా రాజకీయ నాయకులను మించిపోయారు. అడ్డగోలు సంపాదనకు అలవాటు పడ్డారు. నీరా రాడియా ను మించి లాబీయింగ్ చేస్తున్నారు. అందువల్లే కోట్లకు కోట్లు సంపాదించి ఈ స్థాయికి ఎదుగుతున్నారు. అరబిందో ఫార్మా కంపెనీ కోహినూర్ అపార్ట్మెంట్లను నిర్మించిన నేపథ్యంలో.. అందులో ఉన్న ప్లాట్లు హాట్ కేకుల మాదిరిగా అమ్ముడు పోయాయట.

ఇదే ఉత్సాహంతో మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు అరబిందో కంపెనీ రెడీ అయిందట. ఫార్మా కంపెనీ కంటే ఇందులోనే ఎక్కువగా లాభాలు వస్తూ ఉండడంతో ఇంకా రెట్టించిన ఉత్సాహంతో ప్లాట్లు కట్టాలని నిర్ణయించిందట. ఎంతైనా హైదరాబాద్ చాలా గ్రేట్.. ఎందుకంటే ఇప్పుడు చాలా రిచ్ అయిపోయింది. ఇక్కడ పుట్టి.. ఇక్కడ పెరిగిన వారికి దూరమైపోయింది.. ఎక్కడి నుంచి వచ్చి స్థిరపడిన వారికి బాగా దగ్గర అయిపోయింది. ఎందుకంటే అదంతా డబ్బు మహిమ.

# 42 శాతం రిజర్వేషన్ తో కేటాయింపులు

## వ్యూహ రచనల్లో పొలిటికల్ పార్టీలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఈ నెలాఖరులోపు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం అఫిడ విట్ దాఖలు చేయాల్సిన గడువు సమీపిస్తుండటంతో ప్రభుత్వం ఎన్నికల కసరత్తును మొదలెట్టింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఎన్నికల నిర్వహణలో భాగంగా జెడ్పిటిసి( జడ్పీ చైర్మన్) ఎంపీటీసీ( ఎంపీపీ) సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్లకు అంతర్గత ఆదేశాలు జారీ చేశారు.బీసీలకు కుల గణన సర్వే ద్వారా నలభై రెండు శాతం, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు 2018 లో కేటాయించిన లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని పలు డైరెక్షన్ల ఆయన సూచించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా జడ్పీ సీఈవో, పంచాయతీ అధికారి, ఎంపీడీఓలు జిల్లా, మండలం, గ్రామాల వారి గా రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రిజర్వేషన్లకు సంబంధించింది పూర్తి వివరాలను ఎక్కడ బయటకు ఒక్క కుండ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సీరియస్గా జిల్లా కలెక్టర్ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల అంశంపై సంబంధిత అధికారులు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు.జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు మెజార్టీగా మార్పులు చేర్పులు కానున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు, 2024 కులగణన ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా మండలాల వారిగా కులాల జనాభా లెక్కల పై అధికారులు దృష్టి సారించి వివరాలను సేకరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో కేటాయించిన రిజర్వేషన్లను 2006, 2013, 2019ను సైతం పరిగణలోకి తీసుకొని రొటేషన్ సిస్టంలో కొత్త రిజర్వేషన్లు జాబితాలను రూపొందిస్తున్నారు. ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% సీట్లు కేటాయించేందుకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ లెక్కలను పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్లు మార్పులు చేర్పులు చేయనున్నారు.టిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో రిజర్వేషన్లను పదేళ్లుగా అమలు చేయాలని జీవో తీసుకొచ్చింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను కాంగ్రెస్ ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసి రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలుకు కార్యచరణ సిద్ధం చేసింది. బీసీ, ఎస్సీ,ఎస్టీలకు కేటాయించిన తర్వాతే మిగిలిన స్థానాలు జనరల్ కేటాయించి.. అందులో మొత్తం మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించనుంది. వాళ్ళ లెక్కన జిల్లా వ్యాప్తంగా మొత్తం రిజర్వేషన్ సిస్టం మారుతుంది. దీంతో స్థానిక పోరు ఎన్నికల్లో ఏ గ్రామం, మండలం, జిల్లాలో ఎవరికి రిజర్వేషన్ కేటా యించ ొబడతాయని పలువురు ఆశావహవులు ఆసక్తిగా ఎదురుచూపులు చూస్తున్నారు. రాష్ట్ర స్థాయి లో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి జిల్లా జడ్పీ చైర్మన్ల కు రిజర్వేషన్లు ఖరారు చేయగా, జిల్లా స్థాయిలో కలెక్టర్లు జెడ్పిటిసి ఎంపీపీ, ఎంపీటీసీ లో స్థానాలకు రిజర్వేషన్లు కేటాయిస్తారు..

# కొత్త వాహనాలకు రోడ్ సేఫ్టీ ట్యాక్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24, కొత్త వాహనాలు కొనుగోలు చేసే ఆలోచనలో ఉన్నారా?? అయితే మీరు మరో కొత్త ట్యాక్స్ కట్టేందుకు సిద్ధం కావాల్సిందే?! ప్రస్తుతం ఉన్న వెహికిల్ లైఫ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం ఇలా అనేక పలు రకాల ట్యాక్సులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వీటికి తోడుగా మరో ట్యాక్ రాబోతుంది. ఇదే అంశంపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.కొత్తగా కొనుగోలు చేసే వాహనాలపై రోడ్డు భద్రతా సెస్(రోడ్ సెఫ్టీ ట్యాక్స్) విధించాలని రవాణాశాఖ నిర్ణయించింది. ఈ కొత్త ప్రతిపాదనకు సర్కార్ నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలిసింది. అయితే ఈ ట్యాక్స్ అమల్లోకి రావాలంటే? చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఇదే అంశంపై ప్రభుత్వం కసరత్తు షురూ చేసింది. శాసనసభ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందిన తర్వాత? ఈ ట్యాక్స్ ను అమల్లోకి తీసుకురావాలని చూస్తోంది.ఈ కొత్త ట్యాక్స్ నిర్ణయం అమల్లోకి వస్తే?. వాహన రకాన్ని బట్టి ట్యాక్స్ మారుతుంది. కనిష్ఠంగా రూ.2 వేలు ఉంటుందని తెలుస్తోంది. గరిష్ఠంగా రూ.10 వేల వరకు రోడ్డు భద్రత సెస్ కింద వసూలు చేస్తారు. ఈ సెస్సును కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే వసూలు చేయాలని రవాణాశాఖ ప్రతిపాదించింది.రోడ్డు భద్రతపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆదేశాల మేరకు ఈ తరహా నిర్ణయం తీసుకున్నట్లు రవాణశాఖ వర్గాలు చెబుతున్నాయి. రోడ్డు భద్రతా చర్యల అమలు కోసం ఈ సెస్ ను ప్రతిపాదిస్తున్నట్లు తెలుపుతున్నాయి. ఇలా వచ్చే ఆదాయాన్ని రోడ్డు భద్రతా కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడే సూచనలున్నాయి.అన్ని రకాల వాహనాలకు కాకుండా? కొన్నింటికి మాత్రమే ఈ ట్యాక్స్ ను విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ అవసరాలకు వినియోగించే వాహనాలతో పాటు ఆటో కార్మికుల జీవనోపాధికి ఉపయోగించే వాహనాల్ని ఈ ట్యాక్స్ నుంచి మినహాయించే అవకాశం ఉంది. రవాణాశాఖ అధికారికంగా విడుదల చేసే వివరాల తర్వాత? ఈ విషయంలో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ప్రజలపై భారం అత్యంత దారుణం – కేటీఆర్

ఈ కొత్త ట్యాక్స్ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే వాటిని అమలుచేయాల్సింది పోయి, వాహన కొనుగోలుదారులపై భారం మోపడం ముఖ్యమంత్రి ప్రజావ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు."రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించి భద్రతా ప్రమాణాలను పెంచకుండా ఇలా అమాయక ప్రజలపై భారం మోపడం అత్యంత దారుణం. హైడ్రా వంటి దిక్కుమాలిన విధానాలతో ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటును పూడ్చలేక సామాన్య ప్రజలపై విరుచుకుపడటం దుర్మార్గమైన చర్య. రహదారి భద్రతా సెస్ పేరిట ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రెండు నుంచి పదివేల వరకూ అదనపు భారం వేయడం పేద, మధ్యతరగతికి చెందిన ప్రజానీకాన్ని దగా చేయడమే" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు."రెండేళ్లు కావస్తున్నా ఇవ్వాల్సిన గ్యారెంటీలను గాలికొదిలేసి, చివరికి ప్రజల నుంచే ముక్కుపిండి రూ.270 కోట్లు వసూలు చేసే కుట్రచేస్తే కాంగ్రెస్ సర్కారును ప్రజలు క్షమించరు. పైసా పైసా కూడబెట్టుకుని, అప్పు చేసి మరీ వాహనం కొనుగోలు చేసే వారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు కాంగ్రెస్ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలి" అని కేటీఆర్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# డిగ్రీలో సగం..సీట్లు ఖాళీ

హైదరాబాద్, సెప్టెంబర్ 24, స్పెషల్ స్పాట్ అడ్మిషన్లతో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 20తో ముగిసింది. డిగ్రీలో ప్రవేశాలు ముగిసినా సీట్లు మాత్రం పూర్తిస్థాయిలో నిండలేదు. ఎన్నడూలేనంతగా ఈ సారి సీట్లు మిగిలిపోయా యి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) కాలేజీలు 967 ఉన్నాయి. వీటిలో 4,38, 387 సీట్లు ఉంటే, ఇందులో స్పాట్ అడ్మిషన్లు మినహా 1,96,451 సీట్లు భర్తీ అయ్యా యి.ఇంకా 2,41,936 సీట్లు నిండలేదు. స్పా ట్ అడ్మిషన్లలో భర్తీ అయిన సీట్లు దాదా పు 5 వేల వరకు ఉంటాయి. అంటే ఇప్పటివరకు నిండిన మొత్తం సీట్లు 2,06,451 కాగా, ఇంకా మిగిలిన సీట్లు 2,31,936 ఉన్నాయి. ఇంత మొత్తంలో సీట్లు గతేడాది కూడా మిగల్లేదు. కానీ, సీట్ల పరంగా చూసుకుటే ఈ సారి అత్యధికంగా ఖాళీగా మిగలడం గమనార్హం. 2024–25 విద్యాసంవత్సరంలో మొత్తం 4,57,704 సీట్లకు 2.12 లక్షలు సీట్లు భర్తీకాగా, 2.45 లక్షల సీట్లు ఖాళీగా మిగిలాయి.టాప్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనే కాదు.. గురుకులాల్లోనూ ఈ సారి సీట్లు మిగిలాయి. తెలంగాణ సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలు 79 ఉండగా, ఇందులో 23,614 సీట్లకు 11,257 సీట్లే భర్తీ అయ్యాయి. ఈ నెల 11 వరకు ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం గురుకులాల్లో 12,357 సీట్లు మిగిలాయి. సోషల్ వె ల్ఫేర్ డిగ్రీ కాలేజీల్లో 8,080 సీట్లకు 2,897 సీట్లు మిగలగా, ట్రైబల్ వెల్ఫేర్‌లో 5,620 సీట్లలో ఇంకా 2,291 సీట్లు నిండలేదు.బీసీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీల్లో 9,914 సీట్లకు 7,169 సీట్లు మిగిలాయి. ఇక దోస్త్ పరిధిలోలేని కాలేజీలు 58 ఉన్నాయి. వీటిలో 36,866 సీట్లకు 16,182 మాత్రమే నిండగా, 20,684 సీట్లు మిగిలాయి. ఇలా మొత్తంగా స్పాట్ అడ్మిషన్లలో సుమారు ఓ 5 వేల సీట్లు నిండాయనుకున్నా, మొత్తం 967 కాలేజీల్లో 4,38,387 సీట్లకు 2,06,451 సీట్లు నిండగా ఇంకా సీట్లు 2,31,936 భర్తీ కాలేదు.

మొదటి నుంచీ ఇంతే

మొదటి నుంచీ డిగ్రీ కోర్సు ల్లో సీట్లు అత్యధికంగా మిగులుతున్నాయి. బీఎస్సీ, బీఏ, బీకామ్‌లలో ఒక్క బీకామ్ మినహాయిస్తే మిగతా కోర్సుల్లో విద్యార్థు లు చేరేందుకు ఇష్టపడటంలేదు. డిగ్రీ చేసినవారికి ఉపా ధి అవకాశాలు తక్కువగా ఉండ టం, ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతరత్రా డిమాం డ్ ఉన్న కోర్సులవైపు విద్యార్థు లు మక్కువ చూపిస్తుండటం దీనికి ప్రధాన కారణం.ఈ క్రమంలోనే ఏటా డిగ్రీలో సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా డిగ్రీ సిలబస్‌ను ఎప్పటి కప్పుడు తెలంగాణ ఉన్నత విద్యామండలి మార్పులు చేర్పులు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయి లో సీట్లు నిండటంలేదు. ఇప్పటికే నాలుగైదు దఫాల్లో డిగ్రీ సీట్లు నింపినా రెండు లక్షల సీట్లే భర్తీ అయ్యాయి.

# డిస్కమ్ పై సర్కార్ కసరత్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 24, రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థల్లో కీలక మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్ లు మాత్రమే కాకుండా? మరో కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇదే విషయంపై గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలను కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో? కొత్త డిస్కమ్ ఏర్పాటుపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాజాగా అధికారులు పలు ప్రతిపాదనలను సిద్ధం చేయగా?. సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఇందనశాఖపై సమీక్షించారు. మూడవ డిస్కం ఏర్పాటుకు వీలైనంత తొందరగా పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సంబంధిత పీపీఏ అలొకేషన్, సిబ్బంది, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై సూచనలు చేశారు. మంత్రిమండలి ఆమోదం తర్వాత మూడో డిస్కంపై ముందుకు వెళ్లాలని చెప్పారు.రాష్ట్రంలో సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్, నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ లతో పాటు మరో డిస్కం ఏర్పాటు ప్రతిపాదనలపై ఇంధన శాఖ సిద్ధం చేసిన ప్రాథమిక ప్రణాళికను అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా, జీహెచ్ఎంసీ పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనలను వివరించారు.గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ విధానంపై పలు ప్రతిపాదనలు, డీపీఆర్ తయారీకి సంబంధించిన అంశాలను కూడా ముఖ్యమంత్రికి వివరించారు. వీటితో పాటు కోర్ అర్బన్ రీజియన్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లను అధునీకరించే అంశాలను తెలియజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అంశాలపై కీలక ఆదేశాలిచ్చారు. వచ్చే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పూర్తి చేయాలన్నారు."కోర్ అర్బన్ రీజియన్‌లో ఎక్కడెక్కడ కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందో గుర్తించాలి. ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా లోడ్ రీప్లేస్మెంట్ చర్యలు చేపట్టాలి. సబ్ స్టేషన్ సామర్థ్యంకన్నా ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" అని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు."అవసరమైన చోట సబ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. విద్యుత్ సబ్ స్టేషన్‌లలో అధునాతన సాంకేతికతను ఉపయోగించాలి. విద్యుత్ కేబుళ్లతో పాటు ఇతర కేబుళ్లు సైతం అండర్ గ్రౌండ్ వ్యవస్థను ఉపయోగించుకునేలా ఉండాలి. దీనిపై బెంగుళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలి. వచ్చే డిసెంబర్‌లోగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలి" అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## నిండా ముంచిన నకిలీ విత్తనాలు

వరంగల్ నకిలీ మొక్కజొన్న విత్తనాలు తమను నిండా ముంచాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫెర్టిలైజర్ షాపు యజమాని మాయమాటలు విని విత్తనాలు కొన్న తమకు తీరని అన్యాయం జరిగిందని బాధిత రైతులు కన్నీటి పర్యంతమైన విషాదఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు మౌర్య పవన్ సింగ్ 3 ఎక రాలు, బానోతు యాకుబ్ 2 ఎకరాల, బానోతు సహదేవ్2 ఎకరాలు ఇలా ముగ్గురు రైతులకు ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామంలో తెలిసినవారు ఉండటంతో అక్కడి ప్రైవేటు దుకాణాల్లో డికాల్బ్ డీకేసీ 9178 రకం మొక్కజొన్న విత్త నాల పాకెట్స్ 1850 చొప్పున 14 సంచులు కొనుగోలు చేశారు. ఏడెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటలో కంకులు రావడం లేదని, ఖాళీ బెండ్లు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం న్నారు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయా మని, పరిహారం అందించి ఆదుకోవాలని సదరు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నకిలీ విత్తనాలకు పెట్టిన పెట్టుబడితో తీవ్రంగా నష్టపోయామని రైతులు తమ గోడును వెలబోసుకున్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు బాగున్నాయి...

### – జగన్మాతను దర్శించుకున్న రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్ర మోహన్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ నేతృత్వంలో నవరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చాలా బాగా చేశారని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురాం కృష్ణరాజు అన్నారు. బుధవారం ఆయన శ్రీ అన్నపూర్ణాదేవి అలంకృత జగన్మాతను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందజేశారు. ఆయనతోపాటు చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ కూడా జగన్మాతను దర్శించుకున్నారు.

## భద్రాచలం ఏషియన్ థియేటర్ వద్ద పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఆందోళన

భద్రాచలం పట్టణంలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కు టికెట్లు ఇవ్వకుండా అక్రమంగా థియేటర్ సిబ్బందికి నచ్చిన నలుగురు వ్యక్తులకే టికెట్లు ఇచ్చారని ఆరోపణ చేస్తూ ఫ్యాన్స్ ఆందోళనకు దిగారు. ఏషియన్ థియేటర్ వద్ద ఫాన్స్ కు టికెట్లు ఇవ్వకపోవడం వల్ల, షో రద్దయిందని ఫ్లెక్సీలు అంటించారు. ఏషియన్ థియేటర్ టికెట్స్ కౌంటర్, థియేటర్కు తాళాలు వేసారు. ఫ్యాన్స్ కు టికెట్ ఇవ్వకపోతే, ఎంతటి ఆందోళనకైనా సిద్ధమని పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ హెచ్చరించారు.


# చీచీక్రికెట్ మైదానం నుంచి ఉగ్రవాద శిబిరాల వరకు

భారత్?పాకిస్తాన్.. రెండూ దాయాది దేశాలే.. ఒకే తాను ముక్కలే.. కానీ ఏడు దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వైరం ఏటా పెరుగుతోంది. ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ వైరం మరింత పెరిగింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్.. భారత్ తలుచుకుంటే చరిత్ర పటంలో మిగలదు. కానీ, అక్కడి పాలకులు, ఉగ్రవాదులు పాకిస్తానీలకు అణువనువునా విద్వేషం పెంచి పోషిస్తున్నారు. భారత వ్యతిరేకులుగా మారుస్తున్నారు. ఇందుకు తాజా నిదర్శనం ఆసియా కప్ 2025 సూపర్ 4లలో భాగంగా సెప్టెంబర్ 21న జరిగిన భారత్?పాకిస్తాన్ మ్యాచ్ క్రికెట్ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఓపెనర్ సహీబ్‌జాదా ఫర్హాన్ తన 50 పరుగుల సందర్భంగా బ్యాట్‌ను తుపాకీలా పట్టుకుని కాల్చినట్లు అభినయించడం, హారిస్ రౌఫ్ 'రాఫెల్' విమానం కూల్చినట్లు చేతులతో సూచించడం వంటి సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. ఈ చర్యలు 'జెంటిల్‌మెన్స్ గేమ్' నుంచి యుద్ధ వాతావరణంగా మార్చాయి. మ్యాచ్ తర్వాత భారత్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పాకిస్తాన్ కెప్టెన్‌తో షేక్ హ్యాండ్‌లు చేయకపోవడం, సిరీస్ గెలిస్తే పాకిస్తాన్ వ్యక్తి చేత అవార్డు స్వీకరించకపోవాలని నిర్ణయం తీసుకోవడం ఈ విద్వేషాన్ని మరింత ఊపందుకునేలా చేసింది.పాకిస్తాన్ క్రికెటర్లు మ్యాచ్‌లో చూపిన అభినయాలు క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తూ, దేశంలోని ఉగ్రవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఫర్హాన్ తన బ్యాట్‌ను ఏకే?47 తుపాకీలా పట్టుకుని భారత జట్టు దిగ్బంధనం వైపు 'కాల్చినట్లు' చేయడం, రౌఫ్ 'రాఫెల్' విమానం కూల్చినట్లు చేతులతో సూచించి '6?0' అని చూపించడం (ఆపరేషన్ సిందూర్‌లో పాక్ 6 భారత విమానాలను కిందపడేశామనే తప్పుడు ప్రచారానికి సూచన) వంటివి సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఈ చర్యలు పాకిస్తాన్ సమాజంలోని 'ముజాహిద్ మెంటాలిటీ'ని మైదానంలోకి తీసుకువచ్చినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇది క్రికెట్‌ను రాజకీయ ఆయుధంగా మార్చి, భారత్‌పై విద్వేషాన్ని ప్రదర్శించడానికి ఉదాహరణగా మారింది. ఫలితంగా, భారత జట్టు పాక్ ఆటగాళ్లతో దూరం పాటించడం మొదలుపెట్టింది, ఇది క్రీడా భావనలకు విరుద్ధమని అంతర్జాతీయ క్రికెట్ సంఘాలు చర్చిస్తున్నాయి.మే 7 భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) మరియు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రస్థావరాలపై దాడి చేసి, 100 మంది ఉగ్రవాదులను చంపింది. ఈ దాడుల్లో జైష్?ఏ?మహ్మద్ (జెఎమ్) ప్రధాన కార్యాలయం బహావల్‌పూర్‌లోని మర్కజ్ సుభానల్లా, లష్కర్?ఏ?తొయిబా (ఎల్ఎటి) మురీద్కేలోని మర్కజ్ తైబా వంటి కీలక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో జెఎమ్ ప్రధాని మసూద్ అజర్ కుటుంబ సభ్యులు 10 మంది మరణించారు, అతని సోదరుడు యూసుఫ్ అజర్ (1999 కాందహార్ విమాన హైజాక్ చేసినవాడు) సహా. మసూద్ అజర్ 1999లో భారత విమానాన్ని హైజాక్ చేసి విడుదలైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు, జెఎమ్‌ను స్థాపించి పార్లమెంట్, పుల్వామా దాడులకు కారణమయ్యాడు. ఈ దాడులు పాహల్గామ్ టెర్రర్ అటాక్ (ఏప్రిల్ 22, 2025లో 26 మంది మరణాలు)కు ప్రతీకారంగా జరిగాయి. ఈ సంఘటనలు పాక్ ఉగ్రవాద యంత్రాంగానికి తీవ్ర దెబ్బ తీసుకొచ్చాయి.ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్?ప్రాయోజిత ఉగ్రవాద సంస్థలు పీవోకే, పంజాబ్ నుంచి కైబర్ పక్తూంఖ్వా (కేపీకే)కు తమ స్థావరాలను తరలిస్తున్నాయి. జెఎమ్, ఎల్ఎటి, హిజ్బుల్ ముజాహిదీన్ (ఎచ్ఎమ్) వంటి సంస్థలు కేపీకేలోని మాన్సెహ్రా, గర్హీ హబీబుల్లా వంటి ప్రాంతాల్లో కొత్త శిబిరాలు నిర్మిస్తున్నాయి. ఈ తరలింపు భారత దాడుల నుంచి రక్షణ కోసం, అఫ్ఘనిస్తాన్ సరిహద్దు సమీపంలోని కఠిన భూభాగాన్ని ఉపయోగించడానికి జరుగుతోంది. సెప్టెంబర్ 14న మాన్సెహ్రాలో జెఎమ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరగడం ఈ మార్పును స్పష్టం చేసింది. పాక్ ప్రభుత్వం ఈ చర్యలకు మద్దతు ఇస్తూ, ఉగ్రవాదులకు సురక్షిత ప్రదేశాలు అందిస్తోంది. ఇది భారత్‌పై తదుపరి దాడులకు తయారి చేస్తున్నట్లు తెలుస్తోంది.ధ్వంసమైన ఉగ్రస్థావరాల పునర్నిర్మాణంపై పాకిస్తాన్ ఉగ్రవాద యంత్రాంగం పట్టుదలను చూపిస్తోంది. బహావల్‌పూర్‌లోని సుభానల్లా కాంప్ కాంప్లెక్స్ (సరిహద్దు నుంచి 200 కి.మీ. దూరం), మురీద్కేలోని ఎల్ఎటి కేంద్ర కార్యాలయాలు పాక్ ప్రభుత్వ సహాయంతో పునర్నిర్మిస్తున్నాయి. మురీద్కేలో ఆగస్టు 18 నుంచి డిమాలిషన్ పూర్తి చేసి, సెప్టెంబర్ 7 నాటికి పునర్నిర్మాణం ప్రారంభమైంది, 2026 ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయికి చేర్చాలని లక్ష్యం. పాక్ ప్రభుత్వం 4 కోట్లు మద్దతు ఇచ్చింది, 'ఫ్లడ్ రిలీఫ్' పేరిట డబ్బులు సేకరిస్తూ ఈ పనులకు ఉపయోగిస్తున్నారు. ఈ చర్యలు ఉగ్రవాదాన్ని పునరుజ్జీవనం చేస్తూ, భారత్‌పై కొత్త ముప్పును సృష్టిస్తున్నాయి.ఆసియా కప్ మ్యాచ్‌లో పాక్ క్రికెటర్ల ప్రవర్తన, ఉగ్రస్థావరాల తరలింపు, పునర్నిర్మాణం భారత్?పాకిస్తాన్ మధ్య విద్వేషం ద్వంద్వాన్ని స్పష్టం చేస్తున్నాయి. క్రికెట్ మైదానంలో 'తుపాకీ, విమాన ధ్వంసం' అభినయాలు ఉగ్రవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంటే, ఆపరేషన్ సిందూర్ తర్వాత కేపీకేలో కొత్త శిబిరాలు భవిష్యత్ దాడులకు సిద్ధం కావడాన్ని సూచిస్తున్నాయి. భారత్ ఈ ముప్పును ఎదుర్కోవడానికి డిప్లొమసీ, సైనిక చర్యలు మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఇస్రోను నేడు ప్రపంచ స్థాయి సంస్థగా నిర్మించిన గొప్ప వ్యక్తి సతీష్ ధావన్

## -భారతదేశంలో ప్రయోగాత్మక ద్రవ డైనమిక్స్ పరిశోధన పితామహుడు ధావన్

## -నేడు మాజీ ఇస్రో చైర్మన్ డాక్టర్ సతీష్ ధావన్ జయంతి




( పెండ్యాల రామ్ కుమార్, మంథని )ఇస్రోను నేడు ఉన్న విధంగా ప్రపంచ స్థాయి సంస్థగా నిర్మించిన వ్యక్తి డాక్టర్ సతీష్ ధావన్..సతీష్ ధావన్ ఒక భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు మరియు ఏరోస్పేస్ ఇంజనీర్, భారతదేశంలో ప్రయోగాత్మక ద్రవ డైనమిక్స్ పరిశోధన పితామహుడిగా ప్రసిద్ధి చెందారు.25 సెప్టెంబర్1920లో శ్రీనగర్ లో జన్మించిన ధావన్, భారత్ లోను, అమెరికా లోనూ తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయన్ను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఈ రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్షకార్యక్రమ అభివృద్ధికి దోహదపడింది.1972 లో ఎమ్జికె. మీనన్ తరువాత, ఇస్రో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు.1947 లో మిన్నియాపోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి పొందాడు.డాక్టర్ ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఈ చర్య ఎంతో తోడ్పడిందని అంటారు. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు.1975 లో ఎపిజె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్ఎల్‌వి అభివృద్ధి జరిగింది. దాని మొదటి ప్రయోగం విఫలమైంది. ఆ వైఫల్యానికి ధావన్ తానే బాధ్యత వహిస్తూ వైఫల్యాన్ని స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంతమైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు. ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్ఎస్, పిఎస్ఎల్‌విలు రూపొందాయి. 1951 లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దాని డైరెక్టరుగా నియమితుడయ్యాడు. తాను ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు వియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను ధావన్ ఐఐఎస్‌సి లో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవలకు గుర్తుగా 1971పద్మ భూషణ్,1981లోపద్మ విభూషణ్ అవార్డులు ఇచ్చి సత్కరించింది. అదేవిధంగాఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం 1999 లో స్వీకరించారు.2002 జనవరి 3న 81సంవత్సరాల వయస్సు లో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ధావన్ మరణించారు. ఆయన మరణించిన తర్వాత ఆయన గౌరవార్థం సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం పేరు మార్చబడింది, ఇది దక్షిణ భారతదేశంలోని చెన్నైకి ఉత్తరాన 100 కిలోమీటర్ల దూరంలో ఆంధ్రప్రదేశ్లోని శ్రీహరికోటలో ఉంది. లూథియానాలో ఆయన పేరు మీద సతీష్ చందర్ ధావన్ గవర్నమెంట్ కాలేజ్ ఫర్ బాయ్స్ అనే కళాశాల ఉంది. ఈ సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి సతీష్ ధావన్ బ్లాక్, ఐఐటి రోపర్ అనే మారుపేరుతో ఆయన గౌరవించబడ్డారు. 2019లో, కాన్పూర్లోని ఉత్తర ప్రదేశ్ టెక్స్టైల్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ కు కూడా ఆయన పేరు మీద ప్రొఫెసర్ సతీష్ ధావన్ కంప్యూటర్ సెంటర్ అని పేరు పెట్టారు.

# తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

## -ఇంజనీర్ కావాలని కలలు కని గాయకుడైన ఎస్పీబి

## - నలభై వేల పైచిలుకు పాటలు పాడి గిన్నిస్ రికార్డును సాధించారు

## -నేడు ఆయన వర్ధంతి



తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం.ఎస్పీ బాలు పూర్తి పేరు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం.. 1946 జూన్ 4న నెల్లూరులోని కోనేటమ్మ పేట గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఈయన సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతుల రెండో సంతానం. ఇంజనీర్ కావాలని కలలు కని గాయకుడయ్యారు. సావిత్రిని వివాహం చేసుకున్న ఆయనకు చరణ్, పల్లవి అని ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న(1966) చిత్రంలోతొలిసారి పాట పాడారు. శంకరాభరణం, సాగరసంగమం లాంటి తెలుగు చిత్రాలే కాకుండా 'ఏక్ దుజే కేలియే' లాంటి హిందీ చిత్రాలకు బాలు పాడిన పాటలు దేశమంతా ఉర్రూతలూగించాయి. నాలుగు దశాబ్దాలకు పైగా సాగినసినీ ప్రస్థానంలో నలభై వేల పైచిలుకు పాటలు పాడి గిన్నిస్ రికార్డును సాధించారు. తెలుగు, తమిళమే కాకుండా కన్నడంలోనూ ఆయన పాడిన పాటకు ఎన్నో జాతీయ పురస్కారాలు లభించాయి. తమ్ముడు కమల్ హాసన్‌కు చేతిలో సినిమాలు లేని సమయంలో ఆయన మీదున్న ప్రేమతో బాలు నిర్మాతగా మారారు. అలా తీసిని 'శుభ సంకల్పం' ఎన్నో అవార్డులను తెచ్చి పెట్టింది. కమల్ హాసన్, రజనీకాంత్, సల్మాన్ ఖాన్, జెమిని గణేషన్ వంటి పలువురు హీరోలకు గాత్రదానం కూడా చేశారు. గాన మాధుర్యంతోనే కాదు, నటనతోనూ బాలు ప్రేక్షకులను కట్టిపడేశారు. 1969లో పెళ్ళంటే నూరేళ్ళ పంట అనే చిత్రంలో మొదటిసారి నటుడిగా కనిపించారు. తమిళ 'కేలడి కన్మణి'లో కథానాయకుడి పాత్ర పోషించారు. ఈ సినిమా తెలుగులో ఓ పాప లాలీ పేరుతో అనువాదం అయింది. తర్వాత పవిత్ర బంధం, దేవుళ్లు, దేవదాస్, మిథునం వంటి పలు సినిమాల్లోనూ నటించారు. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం..తెలుగు సినిమా గీతాలకు దొరికిన ఒకానొక ఆణిముత్యం. విషాద పాటలైనా, ప్రేమ గీతాలైనా, మాస్ బీట్స్ అయినా.. సందేశాత్మకాలైనా.. ప్రతీది ఆయననోట అలవోకగా జాలువారుతాయి. ఘంటసాల తరువాత ఆ స్థాయి పేరు ప్రఖ్యాతలు పొందిన ఏకైక గాయకుడు. హీరోల వాయిస్ తగినట్లు పాడడం ఆయన స్పెషల్. చాలామంది నటులకు వారి హావభావలకు, నటనా శైలులకు అనుగుణంగా అతను పాటలు పాడి ప్రాణం పోశారు. జీవితాన్నే మార్చేసిన 'శంకరాభరణం'ఘంటసాల మరణం తర్వాత తెలుగు సినిమా పాటలకు ఎస్పీ బాలుయే పెద్ద దిక్కయ్యారు. తన గాత్రంతో పాత్రలకు ప్రాణం పోశాడు. ముఖ్యంగా బాలు సినీ జీవితం 'శంకరాభరణం'సినిమాతో పూర్తిగా మారిపోయింది. అప్పటివరకు మాస్ గీతాలకే పరిమితం అయిన బాలు.. ఈ సినిమాలో క్లాసికల్ పాటలను సైతం అద్భుతంగా పాడగలనని విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నాడు. ఈ చిత్రానికి బాలు తొలిసారి జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డు అందుకున్నాడు. తెలుగులోనే కాదు ఉత్తరాదిన కూడా పాడి తన సత్తా చాటాడు బాలూ. హిందీలో తొలిసారి 'ఏక్ దూజేలియే' చిత్రంలో.. అద్భుతంగా పాడి అక్కడివారిచేత శభాష్ అనిపించుకున్నాడు. ఈ సినిమాకు కూడా ఉత్తమ గాయకుడిగా జాతీయ అవార్డు దక్కడం విశేషం. తెలుగు తో పాటు హిందీ, తమిళం, కన్నడ లాంటి నాలుగు భాషల్లో కలిపి ఆరు సార్లు జాతీయ ఉత్తమగాయకుడిగా నిలవడం ఒక్క బాలసుబ్రహ్మణ్యానికే చెల్లింది. ముఖ్యంగా భక్తి పాటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. అన్నమయ్య, శ్రీరామదాసు, శ్రీరామరాజ్యం చిత్రాలలో బాలు ఆలపించిన భక్తి గీతాలు ఇప్పటకి ప్రతి ఇంటావినిపిస్తూనే ఉన్నాయి.ఎస్పీ బాలు సుదీర్ఘ ప్రస్థానంలో 6 జాతీయ పురస్కారాలు, 6 ఫిల్మ్ ఫేర్ దక్షిణాది పురస్కారాలు, ఒక ఫిల్మ్ ఫేర్ పురస్కారం అందుకున్నాడు. 1979 లో వచ్చిన సంగీత ప్రధానమైన శంకరాభరణం చిత్రానికి ఆయనకు జాతీయ పురస్కారం లభించింది. రెండు సంవత్సరాల తర్వాత ఆయనకు 1981 లో బాలీవుడ్ లో ప్రవేశించి ఏక్ దూజే కేలియే చిత్రానికి గాను రెండోసారి పురస్కారాన్ని అందుకున్నాడు. తర్వాత సాగర సంగమం(1983), రుద్రవీణ (1988) చిత్రాలకు జాతీయ పురస్కారాలు అందుకున్నాడు. 25 సార్లు ఉత్తమ గాయకుడిగా, ఉత్తమ సంగీత దర్శకుడిగా, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్టుగా, ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాలు అందుకున్నాడు. 2001లో పద్మశ్రీ, 2011లో పద్మభూషన్ వరించింది.

1999లా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 74 ఏళ్ల వయస్సులో చెన్నైలోని ప్రయివేటు ఆసుపత్రిలో సెప్టెంబర్ 25, 2020 న కన్నుమూశారు. గురువారం రాత్రి నుంచి శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డ ఆయన శుక్రవారం మధ్యాహ్నం 1.04 నిమిషాలకు వెంటిలేటర్‌పైనే తుది శ్వాస విడిచారు. త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో వస్తాడనుకున్న అభిమానులను శోకసంద్రంలో ముంచేసి తిరిగి రాని లోకాలకు బాలు వెళ్లిపోయారు. బాలు గురించి మరికొన్ని విషయాలు:? ఓ ఇంటర్వ్యూలో బాలు ఇళయరాజాను బెస్ట్ కంపోజర్‌గా పేర్కొన్నారు. కానీ అదే ఇళయరాజా తన పాటలు ఎవరు పాడినా దానికి ఇంత రాయల్టీ ఇవ్వాలని బాలు అబ్బాయి నిర్వహిస్తున్న సంస్థకు తాఖీదులు పంపారు. మిత్రుడికి లీగల్ నోటీస్ ఇవ్వడమేంటని ఆయన చాలా బాధపడ్డారు.? బాలుకు అత్యంత ఇష్టమైన గాయకుడు మహమ్మద్ రఫీ.? శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రానికి గానూ మొదటి రెమ్యూనరేషన్ 300 రూపాయలు తీసుకున్నారు.? ఒక్క శంకరాభరణం సినిమాకు పాడే విషయంలో మాత్రమే ప్రత్యేకంగా ప్రాక్టీసు చేశారు.? గాయకుడిగానే కాకుండా గాత్రదాన కళాకారుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా ఆయా విభాగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత 29 సార్లు నంది పురస్కారాలు అందుకున్నారు.

# 50వేల కోట్ల విలువైన 923.14 ఎకరాల భూమి.

హైదరాబాద్, సెప్టెంబర్ 24,హైదరాబాదులో ప్రభుత్వ చెరువులను, కుంటలను, నాలాలు పరిరక్షించేందుకు రేవంత్ ప్రభుత్వం హైడ్రా అనే వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చింది. హైడ్రాను తీసుకొచ్చిన నాటి నుంచి హైదరాబాదులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను.. చెరువులను, నాలా లను పరిరక్షిస్తోంది. ఇటీవల హైడ్రా కోసం ప్రభుత్వం ఏకంగా ఒక పోలీస్ స్టేషన్ కూడా నిర్మించింది. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను స్వీకరించడానికి ఒక విభాగాన్ని కూడా ఏర్పాటు చేసింది.హైడ్రా ద్వారా చేపడుతున్న పనులను ఆ సంస్థ అధిపతి రంగనాథ్ ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ ఈ విభాగాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇది ఆయన మానస పుత్రిక కాబట్టి దాని కార్యకలాపాలను.. సాధిస్తున్న ప్రగతిని ఆయన గమనిస్తున్నారు. వాస్తవానికి హైడ్రా ఏర్పాటును కాంగ్రెస్ నాయకులు స్వాగతిస్తుండగా.. గులాబీ పార్టీ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో హైడ్రా చేసింది ఏమీ లేదని.. హైడ్రా వల్ల హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయిందని ఆరోపిస్తోంది. గులాబీ పార్టీ ఆరోపణలు ఎలా ఉన్నప్పటికీ.. హైడ్రా పనితీరు మాత్రం మెజారిటీ ప్రజల అభిమానాన్ని పొందుతున్నది.హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు, కబ్జాల తొలగింపు వంటి బహుళ విధానాలలో హైడ్రా పనిచేస్తోంది. హైడ్రా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 50 వేల కోట్ల విలువైన 923.14 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. చెరువులలో, కాలువలలో ఆక్రమణలు తొలగించింది. ప్రకృతిని పరిరక్షించింది. హైదరాబాద్ నగరానికి సరికొత్త భవిష్యత్తును అందించింది. ఇప్పుడు వస్తున్న ఆరోపణ సంగతి ఎలా ఉన్నా.. హైడ్రా చేసిన పనులు భవిష్యత్తులో హైదరాబాద్ నగర ప్రజలకు ఎంతో ఉపయోగాన్ని ఇస్తాయని హైడ్రా అధిపతి రంగనాథ్ చెబుతున్నారు. హైడ్రా చర్యలు కాస్త కఠినంగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తు కాలంలో అవి ఎంతో గొప్ప ఫలితాలను ఇస్తాయని రంగనాథ్ దీ మా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు హైడ్రా 581 ఆక్రమణలు తొలగించింది. ఇందులో బడా బాబులవే ఎక్కువగా ఉన్నాయని రంగనాథ్ పేర్కొన్నారు.ఇప్పటికే 275 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుని, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. భూ మాఫియాపై ప్రభుత్వం తీసుకుంటున్న ఈ కఠిన చర్యలకు ఇది నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని తిరిగి ప్రజల అవసరాల కోసం వినియోగిస్తారని తెలియజేశారు. గతంలో శేరిలింగంపల్లి పరిధిలోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో అక్రమంగా నిర్మాణంలో ఉన్న భారీ అపార్ట్‌మెంట్‌ను కూల్చివేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్, సికింద్రాబాద్‌లల్లో ఆక్రమణకు గురైన చెరువులను పరిరక్షించడం, వాటిల్లో వెలిసిన అక్రమ కట్టడాలను కూల్చివేయడానికి ప్రత్యేకంగా హైడ్రా వ్యవస్థను తెరమీదికి తీసుకొచ్చింది తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం. ఇప్పటివరకు ఆక్రమణలకు గురైన మీరాలం, బమ్ రుక్ ఉద్ దౌలా, మాదాపూర్ తమ్మిడికుంట వంటి ఎనిమిది చెరువులు, 12 పార్కుల భూములను కాపాడింది. ఆయా చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్‌లల్లో నిర్మితమైన కట్టడాలను కూల్చివేసింది. ఆ స్థలాలకు విముక్తి కల్పించింది.

# నెల్లూరు జిల్లా కందుకూరులో హిజ్రాల దౌర్జన్యం

నెల్లూరు కందుకూరులో హిజ్రాలు దౌర్జన్యానికి పాల్పడ్డారు.మద్యం మత్తులో కోవూరు రోడ్డులోని ఓ ఆసుపత్రికి వెళ్లి, డిమాండ్ చేసినంత డబ్బులు ఇవ్వలేదని నర్సుపై దాడి చేసారు. ఇష్టమొచ్చినట్లు బూతులు తిడుతూ, జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి, బట్టలు చించేసి నర్సుపై ఆరుగురు హిజ్రాలు దాడి చేసారు.

# యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోగా రవినాయక్



**యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రెటరీ జీ.రవినాయక్ నియమితులయ్యారు . ప్రస్తుత కార్యనిర్వహణాధికారి వెంకట్రావు తన వ్యక్తిగత అవసరాల రీత్యా నెలరోజుల పాటు సెలవులో వెళ్తుండగా, ఆయన స్థానంలో పూర్తిస్థాయి ఇన్చార్జి ఈవోగా రవినాయక్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా జాయింట్ కలెక్టరేట్ గా పని చేసిన అనుభవం ఉండటంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.గురువారం ఆలయ దేవస్థానం ఈవోగా రవి నాయక్ బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

## జీఎస్టీని తగ్గింపు పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు

## బిజెపి రాష్ట్ర పదాధికారుల సమావేశం లో నిర్ణయం

## మీడియా సమావేశం లో పార్టీ ప్రధాన కార్యదర్శి డా. గౌతం రావు వెల్లడి




**హైదరాబాద్ సెప్టెంబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన నూతనంగా నియమించబడిన రాష్ట్ర పదాధికారులతో బుదవారం సమావేశం జరిగింది.కొత్తగా నియామకమైన ఆఫీస్ బేరర్స్‌తో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు తొలిసారిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు.ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ , జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్ రావు , రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు.అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి డా. గౌతం రావు మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలపై సమీక్ష మరియు ప్రణాళిక రూపొందించడం జరిగింది.నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈఎస్ ఇలా అనేక వర్గాలకు లబ్ధి కలిగేలా జీఎస్టీని తగ్గిస్తూ చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నట్లున్ తెలిపారు. తగ్గించిన జీఎస్టీ కూడా అమలులోకి రావడం జరిగింది. దీనిపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో వినియోగదారులను కలిసి వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా స్వదేశీ ఉద్యమంలో భాగంగా అన్ని జిల్లాల్లో, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని కూడా తీర్మానించారు.ముఖ్యంగా సెప్టెంబరు 30వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ గారి జీవన ప్రయాణంపై ప్రత్యేకంగా 'మేరా దేశ్ పహలే' కల్చరల్ కార్యక్రమం హైటెక్ సిటీలో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు.ఈ నెల 30వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ హైటెక్ సిటీలో "మేరా దేశ్ పహలే" కల్చరల్ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి అనేక మంది ప్రముఖులు హాజరుకానున్నారు. దాదాపు 10 వేల మంది పాల్గొనే విధంగా కార్యక్రమం రూపొందించబడింది.అదేవిధంగా రాబోయే జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ పై కూడా ఈ సమావేశంలో చర్చించాం. ఈ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమని విశ్వాసాన్ని వ్యక్తం చేసారు. అంతేకాకుండా రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు,... ప్రజాసమస్యల పరిష్కారంలో, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ నిరక్ష్య వైఖరిని ఎండగట్టేలా చేపట్టాల్సిన పోరాట కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు చేసిన మోసాలను వివరించి ప్రజల్లో చైతన్యం కల్పించేలా అవగాహన కార్యక్రమాలను జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించారు.రేపటి నుండి అసెంబ్లీ, మండల, జిల్లా స్థాయిల్లో ఈ కార్యక్రమాలను బిజెపి విస్తృతంగా చేపట్టనుంది.ఈ మీడియా కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ , పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారిన.. మారని గిరిజనుల రాతలు

## పట్టణాల్లో అభివృదది జరిగితే దేశాభివృద్ధా?

## స్వాతంత్ర్యం రాకముందు డోలీ మోతలు ఇప్పుడు అవే డోలీ మోతలు



**హైదరాబాద్ సెప్టెంబర్ 24ప్రజాబలం ప్రతినిధి:** ఐటెక్ యుగంలోని అద్భుతమైన ఎఐ ప్రపంచంలో ఉన్నామని, ఆర్థిక గమనంలో దేశం ముందుకు వెళుందని నాయకులు గొప్పలు చెబుతున్నారు. అభివృద్ధి అనేది పట్టణాలకు పరిమితమైందా?, గిరిజనులు జీవించే ప్రాంతాలలో సరైన రహదారులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. డోలీ మోతలు గిరిజనులకు తప్పడం లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన్యం జిల్లా కొమరాడ మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో గర్భిణీకి తీవ్ర అనారోగ్యాని గురికావడంతో డోలిమోతలో మోసుకుంటూ కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. బంధువులు తమకు డోలీ మోత కష్టాలు తీర్చాలని పాలకులను గిరిజనులు వేడుకుంటున్నారు. స్వాతంత్ర్యం రాకముందు డోలీ మోతలు ఉన్నాయి, ఇప్పుడు డోలీ మోతలు ఉన్నాయని, ఎక్కడా అభివృద్ధి జరిగిందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పట్టణాల్లో జరిగే అభివృద్దే దేశాభివృద్ధా? అని నెటిజన్లు మండిపడుతున్నారు. ఇప్పటికైనా గిరిజన ప్రాంతాల్లో రోడ్డు, రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులే దేశాభివృద్ధికి సూచికలా? అని పాలకులకు చురకలంటిస్తున్నారు.

## గ్రూప్ 1పై హై కోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం

## మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి



**హైదరాబాద్ సెప్టెంబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** గ్రూప్ 1పై హై కోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి తెలిపారు.ప్రభుత్వాన్ని బద్నాం చేద్దామనుకున్న వాళ్లకి కోర్టు తీర్పు చెంపపెట్టన్నారు.గ్రూప్ 1 ర్యాంకర్లపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు నీచ రాజకీయాలు చేశారు.ర్యాంకర్ల తల్లితండ్రులు ఆవేదనకు గురయ్యేలా చేశారు. రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఒక్క గ్రూప్ 1 పోస్టు కూడా ఇవ్వలేదుఉద్యోగాలు రాకుండా అడ్డుకుని విద్యార్థుల జీవితాలతో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆడుకుంటున్నారుకోర్టు తీర్పుతోన్యాయ స్థానాలపై ప్రజలకు ఉన్న విశ్వాసం పెరిగిందన్నారు.

# స్వస్త్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కింద

# హైదరాబాద్ వ్యాప్తంగా

# ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాల నిర్వహణ






%Hyderabad, September 24, 2025 %మహిళలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందుబాటులో ఉండేలా చూసుకోవటంతో పాటు అవగాహన పెంచటంపై దృష్టి సారిస్తూ భారతదేశం అంతటా మహిళలు–పిల్లల ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో 'స్వస్త్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ (ఎస్ఎన్ఎస్‌పీఏ)'ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సీజీహెచ్ఎస్ ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో వరుస ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కవాడిగూడలోని సీజీఓ టవర్స్‌లోని సీజీహెచ్ఎస్ ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో సీనియర్ సీఎంఓ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్ష శిభిరాన్ని నిర్వహించారు. ఉచిత ఆరోగ్య పరీక్షలతో పాటు రొమ్ము– గర్భాశయ క్యాన్సర్లపై కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి జొన్నాదుల మాట్లాడుతూ.. " క్యాన్సర్ చికిత్సను సమర్థవంతంగా అందించాలంటే ముందస్తుగా దానిని గుర్తించటం చాలా కీలకం. ఇలాంటి శిబిరాలు.. నివారణ సంరక్షణను అందించడమే కాకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసుకోవటానికి ఉన్న ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతాయి" అని అన్నారు.

కవాడిగూడ సీజీఓ టవర్స్‌లో ఆరోగ్య, స్వచ్ఛతా శిబిరం

ఈ కార్యక్రమానికి హాజరైన పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్.. కేంద్ర ప్రభుత్వం చేపడుతోన్న 'స్వచ్ఛోత్సవ్' అనే మరో ముఖ్యమైన కార్యక్రమం గురించి మాట్లాడారు. మంచి ఆరోగ్యం– మంచి పర్యావరణానికి మధ్యనున్న అంతర్లీన సంబంధాన్ని చెప్పారు. 'పునర్వినియోగం – పునరుత్పత్తి – తగ్గించటం( రీయూజ్– రీసైకిల్– రెడ్యూస్) ' అనే మంత్రాన్ని అందరూ పాటించాలని ఆమె కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటాన్ని ప్రోత్సహించేలా కార్యక్రమంలో పాల్గొన్న వారికి జనపనార సంచులను పంపిణీ చేశారు.

బేగంపేటలోని సీజీహెచ్ఎస్ ఆరోగ్య సంరక్షణ కేంద్రం–4.. మహిళల కోసం కాలేయ వ్యాధుల పరీక్ష శిబిరాన్ని నిర్వహించింది. నివారణ, ముందస్తు వ్యాధి గుర్తింపు అనే లక్ష్యాలతో చేపట్టిన ఈ ఆరోగ్య పరీక్షల్లో దాదాపు 100 మంది పాల్గొన్నారు. దీనితో పాటు ఆయుష్ వైద్యుల సహకారంతో సీజీహెచ్ఎస్ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ డాక్టర్ రోహిణి ప్రతాబన్ మార్గదర్శకత్వంలో ఔషధ మొక్కల ప్రయోజనాలపై అవగాహన కల్పించటంతో పాటు వాటి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బేగంపేటలోని సీజీహెచ్ఎస్‌లో ఆరోగ్య శిబిరం

ప్రజలకు సాధికారత కల్పించాలనే దార్శనికతకు అనుగుణంగా 2025 సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ.. స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారభించారు. రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి మహిళా ఆరోగ్య సమస్యలకు సమగ్ర పరీక్షలు అందించాలనే లక్ష్యంతో దీన్ని తీసుకొచ్చారు.

## వివేకా హత్య కేసులో తన ప్రతిష్టకు బాబు భంగం కలిగించారు

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిఐ శంకరయ్య లీగల్ నోటీసులు



**అమరావతి సెప్టెంబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిఐ శంకరయ్య లీగల్ నోటీసులు పంపించారు. రూ. 1.45 కోట్లు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వివేకా హత్య కేసులో తన ప్రతిష్టకు బాబు భంగం కలిగించారని ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో సిఎం చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో వివరించారు. తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారని శంకరయ్య ఆరోపణలు చేశారు. వివేకా హత్య జరిగినప్పుడు 2019లో పులివెందుల సిఐగా శంకరయ్య ఉన్నారు. ప్రస్తుతం కర్నూలు రేంజ్‌లో శంకరయ్య వీఆర్‌లో ఉన్నారు. సిఐ శంకరయ్య సమక్షంలోనే నిందితులు హత్యకు సంబంధించిన ఆధారాలు ధ్వంసం చేశారని గతంలో చంద్రబాబు దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

## హరీష్ రావు,కేటీఆర్ శ్రీరంగ నీతులు చెప్తున్నారు

## వాళ్ళ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది




**హైదరాబాద్ సెప్టెంబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** హరీష్ రావు,కేటిఆర్ శ్రీరంగ నీతులు చెప్తున్నారని,వాళ్ళ మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి విమర్శించారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని 50 ఏండ్లు వెనక్కి తీసుకపోయారన్నారు.కులగణన, బిసి బిల్లును అసెంబ్లీ లోపెట్టిన గొప్ప నాయకుడు రేవంత్ రెడ్డి అని కొనియాడారు.మళ్ళీ అధికారంలోకి వస్తామని బిఆర్ ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుండు సున్నా ఇచ్చారుస్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బిఆర్ ఎస్ కు గుండు సున్నా ఖాయం బిఆర్ ఎస్ నాయకులు మాట్లాడిన మాటలను ప్రజలతో పాటు,మీడియా గమనించాలిఇప్పటికైన నిర్మాణాత్మక ప్రతి పక్షంగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను స్వాగతించండిప్రభుత్వం తీసుకవస్తున్న విప్లవాత్మక మార్పులకు ప్రజలు తోడుగా ఉండాలన్నారు.

## కల్లెడలో యూరియా కష్టాలు

వరంగల్ యూరియా బస్తాల కోసం పడిగాపులు కాస్తున్న రైతులను చూస్తుంటే గుండె తరుక్కుపోతుందనని ఆవేదన వ్యక్తం చేశారు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. నెలలు గడుస్తున్న రైతుల యూరియా కష్టాలు తీరడం లేదని.. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తో రైతులు రాష్ట్రంలో వ్యవసాయం చేసే పరిస్థితి లేదని ఎర్రబెల్లి అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ సొసైటీ వద్ద ఉదయం నాలుగు గంటల నుంచి యూరియా బస్తాల కోసం వేచి ఉన్న రైతులతో ఎర్రబెల్లి మాట్లాడారు. వారి వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ అంటేనే కష్టాలకు కేరాఫ్ అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో రైతులు రాజులుగా బతికారని సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంటసాయం, నిరంతరాయ విద్యుత్తు అందించామని ఈ సందర్భంగా ఎర్రబెల్లి గుర్తు చేశారు. బోగస్ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ఇప్పటికైనా ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎర్రబెల్లి తెలిపారు.

## పక్క రాష్ట్రానికి తరలుతున్న యూరియా



జయశంకర్ భూపాలపల్లి యూరియా కోసం రైతులు వ్యవసాయ పనులను సైతం వదులుకొని ఉదయాన్నే క్యూలైన్లలో చెప్పులు పెట్టి పడి కాపులు కాస్తుంటే... మరోపక్క వ్యాపారులు అధికారుల కళ్ళుగప్పి అధిక రేట్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అంతేకాకుండా పక్కనున్న మహారాష్ట్రకు సైతం యదేచ్ఛగా తరలించేస్తున్నారు. దీంతో వ్యవసాయ అధికారుల పనితీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాటారం మండలం గంగారంలోని డీసీఎంఎస్2 గోదాంలో 220 యూరియా బస్తాలు లోడు రాగా అర్ధరాత్రి140 యూరియా బస్తాలను షాపు నిర్వాహకుడు అక్రమంగా విక్రయించి తరలించాడు.విషయం తెలుసుకున్న రైతులు డీసీఎంఎస్ సెంటర్ ముందు ఆందోళనకు దిగారు. వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేయగా ఈపాస్ లో నమోదు చేయకుండా, సరైన బిల్లులు, రసీదులు లేకుండా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి అమ్మకాలు జరిపినట్టు తేల్చారు. సుమారు నాలుగు లక్షల 67 వేల రూపాయలను సీజ్ చేశారు. అమ్మకాలను నిలిపివేసి, స్టాఫ్ సేల్ ఆర్డర్ తో పాటు సోకాస్ నోటీసులు జారీ చేసి లైసెన్స్ సస్పెన్షన్ చేశారు.

మహాదేవపూర్లో మూడు రోజుల క్రితం ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం2 ఎరువుల దుకాణం నుండి అర్ధరాత్రి అక్రమంగా యూరియా తరలిస్తున్నారని రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యూరియాతో వెళుతున్న ట్రాక్టర్ ను సీజ్ చేశారు.

యూరియా కోసం పడి కాపులు కాసి రైతులు ప్రాణాలను సైతం వదులుతున్నారు. ఇలాంటి తరుణంలో అక్రమ యూరియా జోరుగా రవాణా జరుగుతుండడంతో వ్యవసాయ శాఖ అధికారులు అక్రమ రవాణాను అరికట్టడంలో విఫలమవుతున్నారని. అక్రమార్కులకు సహకరిస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి యూరియా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## 26హెచ్1బీ వీసా రుసుం వరం

**- మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ సంచలన వ్యాఖ్య**

**- దేశీ పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం**

**- ట్రంప్‌కు కృతజ్ఞతలు: ప్రొఫెసర్ కామకోటి**

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన లక్ష డాలర్ల హెచ్1బీ వీసా రుసుము పెంపు భారత్‌కు ఒక రకంగా వరం లాంటిదని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటి అభిప్రాయపడ్డారు. ఇది దేశంలోని ప్రతిభావంతులైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు విదేశాలకు వెళ్లకుండా నిరోధించి దేశీయ పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. 'ఇది మనకు ఒక వరంలాంటిది. దీనికి మనం డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు చెప్పాల'ని ఆయన వ్యాఖ్యానించారు. ఈ చర్య వల్ల విదేశాలకు వెళ్లాలనే ఆశతో ఉన్న విద్యార్థులు ఇప్పుడు దేశంలోనే ఉండి తమ దేశ అభివృద్ధికి తోడ్పడతారని కామకోటి అన్నారు. గత ఐదేళ్లుగా ఐఐటీ మద్రాస్ నుంచి కేవలం ఐదు శాతం మంది మాత్రమే విదేశాలకు వెళ్లారని, అమెరికా వెళ్లాలనే మోజు తగ్గిపోయిందని ఆయన తెలిపారు.

## భక్తులు ఈ సూచనలు పాటించాలి

## తిరుపతి జిల్లా ఎస్పీ ఏల్. సుబ్బరాయుడు

తిరుపతి దసరా సెలవులు, లో తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం వుండడంతో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు వీడియో సందేశం ద్వారా ప్రజలకు పలు సూచనలు చేసారు.

శ్రీవారి దర్శనం, వాహన సేవలు సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అలిపిరి నుండి తిరుమల వరకు భద్రతా చర్యలు పటిష్టం చేశారు. చిన్నారుల రక్షణ కోసం చైల్డ్ ట్యాగింగ్ సిస్టం అమలు చేస్తున్నారు. భక్తులు తక్కువ లగేజీతో రావాలి, క్యూ పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని అయన అన్నారు.

వాహన సేవ సమయంలో చిల్లర నాణేలు విసరరాదు. వాహనాలను కేవలం నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలి. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు ఆర్టీసీ, టీటీడీ బస్సులను వినియోగించాలి. మత్తు పదార్థాలు, మద్యం తీసుకొని వస్తే కఠిన చర్యలు తప్పవు. ఘాట్ రోడ్లలో ర్యాష్ డ్రైవింగ్ కఠినంగా నిషేధం. గ్యాలరీల్లో కూర్చుని ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా శ్రీవారి సేవలను ఆరాధించాలని అన్నారు.

సోషల్ మీడియాలో నిరాధార ఆరోపణలు, అసభ్య వ్యాఖ్యలు చేయకుండా బాధ్యతతో వాడుకోవాలి. "ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే 112 నంబర్కు కాల్ చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ను సంప్రదించండి. మీ సహకారంతోనే శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించగలుగుతామని ఎస్పీ విజ్ఞప్తి చేశారు....

### విశాఖ సెంట్రల్ జైలు సందర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

### మహిళా ఖైదీల సమస్యలు తెలుసుకున్న కమిషన్. , ఆహారం రుచి చూసి సంతృప్తి




విశాఖపట్నం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ బుధవారం విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా జైలులోని మహిళా బ్యారేక్ను పరిశీలించిన ఆమె, వారికి అందుతున్న వసతులపై సమగ్రంగా పరిశీలన చేశారు. తరువాత మహిళలకు అందుతున్న భోజన సౌకర్యాలను పరిశీలించి ఆహారం రుచి చూసిన శైలజ, సంతృప్తి వ్యక్తం చేశారు. జైలులో మహిళల జీవనశైలి, వారికి అందిస్తున్న కార్యక్రమాలు, హాస్పిటల్, బేకరీ, ఫ్యాక్టరీల పనితీరును సమీక్షించారు.

# చేనేతలకు ప్రోత్సహంపై ఎమ్మెల్యేలతో వర్కింగ్ గ్రూప్

### అవినీతిని అరికట్టడం ద్వారా రూ.200కోట్లు ఆదాచేశాం

### శాసనసభ్యలంతా వీవర్స్ శాలను అధ్యయనం చేయండి

### అసెంబ్లీలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్



అమరావతి: చేనేత సొసైటీలకు కొంతశాతం యూనిఫాం తయారీ ఆర్డర్ ఇచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు శాసనసభ్యులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. 5వరోజు అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిస్తూ... గతంలో ఆప్కోకు ఆర్డర్ ఇస్తే సొసైటీలు సకాలంలో యూనిఫాం సరఫరా చేయలేకపోయారు. చేనేతలను ప్రోత్సహించే అంశంపై గతంలో కూడా పలుమార్లు చర్చలు జరిగాయి. అయితే ఇందుకోసం స్ట్రక్చరల్ చేంజ్ రావాలి. ప్రభుత్వ టెండరులో సొసైటీలు ఎలా పోటీపడాలనే విషయాన్ని పరిశీలించాల్సి ఉంది. దాదాపు 50 నియోజకవర్గాల్లో చేనేతలు ఉన్నారు. యూనిఫామ్ విషయంలో మార్కెట్ ధరల పోటీని ఎలా ఎదుర్కోవాలనే విషయమై సభ్యులందరం కూర్చుని మాట్లాడాలి. ఇందుకోసం నలుగురైదురు సభ్యులతో వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేస్తాం. చేనేత వృత్తిని అందరం కలసికట్టుగా కాపాడాలి, అదే సమయంలో సరైన విధంగా సరఫరా జరిగేలా కూడా చూడాలి. అందరం కలసి చర్చిస్తే శాశ్వతమైన పరిష్కారం లభిస్తుంది. కమిట్ మెంట్ తో చేనేతలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైన బాధ్యత ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ గారు స్వదేశీ గురించి చెప్పారు. ఇందులో చేనేత కీలకమైన పాత్ర పోషిస్తుందని మంత్రి చెప్పారు.2019-24 నడుమ స్కూలు విద్యార్థులకు యూనిఫాం కొనుగోలులో అవకతవకలు జరిగినట్లు కొన్ని ఫిర్యాదులు అందాయి. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాం, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బెస్ట్ క్వాలిటీతో మంచి ఫ్యాబ్రిక్, డిజైన్ తో విద్యార్థులకు అత్యుత్తమమైన కొత్త యూనిఫాం ఇచ్చాం. గతంలో కంటే డ్యూరబిలిటీ, బ్రీతబిలిటీ ఎక్కువ ఉండే దుస్తులు ఇచ్చాం, బాయ్స్, గర్ల్ కు ఒకే విధమైన యూనిఫాం ఇచ్చాం. పాఠశాల విద్యశాఖలో అయిదేళ్లలో వెయ్యికోట్లు ఆదాచేయాలని అధికారులను ఆదేశించాం. టెండరు విధానం పారదర్శకంగా నడిపించాలని చెప్పాం. దీంతో గతఏడాది సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరిట విద్యార్థులకు అందించే కిట్స్, గుడ్లు, చిక్కీలలో రూ.200 కోట్లు ఆదా చేశాం. ఇదే విధానాన్ని అమలుచేసి అయిదేళ్లలో రూ. వెయ్యికోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదా చేస్తామని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.చేనేతలను ప్రోత్సహించేందుకు మంగళగిరి నియోజకవర్గంలో నిర్మాణాత్మకంగా కృషి చేస్తున్నాం. మంగళగిరిలో వీవర్స్ శాల ద్వారా చేనేత కార్మికులకు 40నుంచి 50శాతం ఆదాయం పెంచామని మంత్రి లోకేష్ చెప్పారు. డిజైన్లు, మార్కెటింగ్ పై టాటా టనేరాతో ఒప్పందం చేసుకున్నాం. మా వంతుగా చేనేత వస్త్రాలను ప్రమోట్ చేస్తున్నాం. గౌరవ సభ్యులు సమయం ఉన్నపుడు వీవర్స్ శాలను సందర్శించాలి. చేనేతలకు మెరుగైన ఉపాధి, ఆదాయం వచ్చేలా మార్కెట్ లింక్ చేసే అంశాన్ని అధ్యయనం చేయాలి. మేం మూడున్నరేళ్లుగా వీవర్స్ శాల ద్వారా చేనేతల ఆదాయం పెంచే ప్రయత్నం చేస్తున్నాం. అయినప్పటికీ ఈ వ్యవస్థలో ఇంకా దళారులు ఉన్నారు, చేనేతలను కాపాడుకునేందుకు దీర్ఘకాలిక ప్రణాళిక అమలుచేయాల్సి ఉంది. చేనేతలు వృత్తిపరంగా ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని అన్నారు.

## వర్గల్ జ్ఞాన సరస్వతి దేవాలయంలో కవిత ప్రత్యేక పూజలు

సిద్దిపేట వర్గల్ లోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో అమ్మవారిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. జాగృతి కార్యకర్తలు, అభిమానులు, ఆలయ ప్రతినిధులు ?కవితకు ఘన స్వాగతం పలికారు.

కవిత మాట్లాడుతూ వర్గల్ సరస్వతి అమ్మవారి ఆలయానికి నవరాత్రి ఉత్సవాల సమయంలో రావడం నా అదృష్టం. అమ్మవారు ఇక్కడ కొలువై ఉండటం మన అదృష్టం. ?అమ్మవారి దయతో అందరూ సంతోషంగా ఆనందంగా ఉండాలి. ?అమ్మవారి దయతో రాష్ట్రంలోని అమ్మాయిలందరి చదువుల్లో రాణించాలని కోరుకుంటున్నానని అన్నారు.

## మానవత్వం చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్ కు

## 'బాధ్యత' అభినందన

కడియం చిన్నారులకు చెప్పులు కొనిపెట్టి మానవత్వం చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్ వెలిశెట్టి వెంకటరత్నంకి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం బాధ్యతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గిరజాల బాబు అభినందన సత్కారం చేశారు. ఇటీవల విజయవాడ పోరంకి సమీపంలో నడిరోడ్డు మీద కాళ్లకు చెప్పుల్లేకుండా వెళుతున్న పిల్లలను చూసి చెల్లించిపోయి వాళ్లకి వెంటనే చెప్పులు కొనిపెట్టి తన ఉదారతను చాటుకున్నారు. ఆయన చేసిన సేవ రాష్ట్రమంతటా వైరల్ అయింది. బాబు నేతృత్వంలో బాధ్యతా సభ్యులు బుధవారం విజయవాడ కామయ్యతోపు జంక్షన్లో ట్రాఫిక్ నిర్వహణా విధుల్లో ఉన్న ఆయన్ని కలిసి అభినందించారు. పూల మొక్కలు, మెమెంటో బహుకరించి, ఆయన సేవలు ప్రశంసిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా గిరజాల మాట్లాడుతూ ఇటువంటి నిజమైన సేవా తత్పరులను అభినందించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వీరి సేవలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బాధ్యత సేవా సంస్థ సేవలు చేయడమే కాకుండా, ఇటువంటి వారిని గుర్తించి వారిని సముచిత రీతిలో గౌరవించడం కూడా చేస్తోందన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు,బాధ్యత సభ్యులు మహమ్మద్ సర్కార్ భాషా, పున్నమ రాజు వీర్రాజు, కొక్కిరాల వెంకటేశ్వరరావు, రాగోలు మహేష్ తదితరులు సత్కార కార్యక్రమంలో ఉన్నారు.

## నారా లోకేష్ నాయకత్వంలో సాల్ట్ ప్రోగ్రాం భేష్...

## ప్రశంసించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు..

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగంలో జరుగుతున్న వినూత్నమైన మార్పులకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల నుండి (చినీతీశ్రీట ఃజీనిని) ప్రశంసలు దక్కాయి. ప్రపంచ బ్యాంకు, సమగ్ర శిక్ష లో అమలవుతున్న సాల్ట్ (ూంఒ) ప్రోగ్రాం కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వినూత్నంగా అమలవుతున్నాయని, ఈ కార్యక్రమాలు దేశానికే కాకుండా దక్షిణ ఆసియా మొత్తానికే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ని ప్రశంసించారు.బుధవారం విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారితో సమావేశమైన ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం, ఆయన నాయకత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పాల్ (ఖంఒ) ల్యాబ్‌లు, గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ ఢ న్యూమరసీ (ఈఒఔ), స్కూల్ లీడర్ షిప్ శిక్షణలు బాగా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యశాఖ కార్యదర్శి కోన శశిధర్, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తో పాటు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు క్రిస్టెల్ కౌమే, సౌమ్య బజాజ్, యిన్ విన్ ఖైన్, ప్రియాంక సాహూ, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ విశిష్టతను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుంది...

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ తెలంగాణ లో పుట్టిన బతుకమ్మ నేడు దేశ విదేశాలలో ఘనంగా జరుపుకుంటున్నారు. 10 సంవత్సరాల కేసీఆర్ ప్రభుత్వం లో ఎంతో వైభవంగా బతుకమ్మను నిర్వహించడం జరిగింది.బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశామం. కేటీఆర్ చొరవతో పీపుల్స్ ప్లాజాలో మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చీరలను పంపిణీ చేయలేదు. కేసీఆర్ ప్రభుత్వం, కాంగ్రెస్ పాలన లోని వ్యత్యాసాన్ని అన్ని వర్గాల ప్రజలు గుర్తించారు. కెసిఆర్ ప్రభుత్వం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు.బతుకమ్మ విశిష్టతను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలనీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షా సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ఇప్పటి వరకు మంజూరైన ఇండ్లు, మార్కౌట్, బేస్‌మెంట్ తదితర అంశాలను సమీక్షించారు.

అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నెల 30 లోపు అనుమతులు పొందిన ఇందిరమ్మ ఇండ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తిచేసి, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నిరంతరం ఇళ్ల నిర్మాణంపై పర్యవేక్షణ చేయాలని, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రతి దశకు సంబంధించిన ఫోటోలను నిబంధనల ప్రకారం సంబంధిత వెబ్‌సైట్‌లో సమయానికి అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీని తగ్గింపు పై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు


### బిజెపి రాష్ట్ర పదాధికారుల సమావేశం లో నిర్ణయం

### మీడియా సమావేశం లో పార్టీ ప్రధాన కార్యదర్శి డా. గౌతం రావు వెల్లడి

హైదరాబాద్ సెప్టెంబర్ 24 బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన నూతనంగా నియమించబడిన రాష్ట్ర పదాధికారులతో బుదవారం సమావేశం జరిగింది.కొత్తగా నియామకమైన ఆఫీస్ బేరర్స్‌తో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు తొలిసారిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు.ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ , జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్ రావు , రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు.అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి డా. గౌతం రావు మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలపై సమీక్ష మరియు ప్రణాళిక రూపొందించడం జరిగింది.నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈఎస్ ఇలా అనేక వర్గాలకు లబ్ధి కలిగేలా జీఎస్టీని తగ్గిస్తూ చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నట్లున్ తెలిపారు. తగ్గించిన జీఎస్టీ కూడా అమలులోకి రావడం జరిగింది. దీనిపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా, అసెంబ్లీ స్థాయిల్లో వినియోగదారులను కలిసి వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అదేవిధంగా స్వదేశీ ఉద్యమంలో భాగంగా అన్ని జిల్లాల్లో, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని కూడా తీర్మానించారు.ముఖ్యంగా సెప్టెంబరు 30వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ గారి జీవన ప్రయాణంపై ప్రత్యేకంగా 'మేరా దేశ్ పహలే' కల్చరల్ కార్యక్రమం హైటెక్ సిటీలో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు.ఈ నెల 30వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ హైటెక్ సిటీలో "మేరా దేశ్ పహలే" కల్చరల్ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి అనేక మంది ప్రముఖులు హాజరుకానున్నారు. దాదాపు 10 వేల మంది పాల్గొనే విధంగా కార్యక్రమం రూపొందించబడింది.అదేవిధంగా రాబోయే జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ పై కూడా ఈ సమావేశంలో చర్చించాం. ఈ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమని విశ్వాసాన్ని వ్యక్తం చేసారు. అంతేకాకుండా రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు,... ప్రజాసమస్యల పరిష్కారంలో, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ నిరక్ష్య వైఖరిని ఎండగట్టేలా చేపట్టాల్సిన పోరాట కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు చేసిన మోసాలను వివరించి ప్రజల్లో చైతన్యం కల్పించేలా అవగాహన కార్యక్రమాలను జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించారు.రేపటి నుండి అసెంబ్లీ, మండల, జిల్లా స్థాయిల్లో ఈ కార్యక్రమాలను బిజెపి విస్తృతంగా చేపట్టనుంది.ఈ మీడియా కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ , పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ పాల్గొన్నారు.

## దుర్గా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, దసరా పండుగ భద్రత పరమైన ఏర్పాట్లు చేయాలి

## జగిత్యాల ట్రాఫిక్,పట్టణ పోలీస్ స్టేషన్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ




జగిత్యాల, దుర్గా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, దసరా పండుగను ప్రశాంతంగా జరిగే విధంగా భద్రత పరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.జగిత్యాల పట్టణ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లను జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఈ సందర్బంగా పోలీస్ స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డులు,కేసు డైరీ, రిజిష్టర్ లను పరిశీలించి, రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని చెక్ చేసి పోలీస్ స్టేషన్లో సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న పెండింగ్ కేసులు అన్ని పూర్తి చెయ్యాలని సూచించారు. బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలి అని నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం జరిగే విధంగా చూడాలి అన్నారు.పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5 ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. పాత నేరస్థుల పై నిఘా ఉంచాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు, యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరాల నివారణ, వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24 లీ 7 గస్తీ నిర్వహించాలని సూచించారు. దుర్గా నవరాత్రి ఉత్సవాలు, దసరా వేడుకలు శాంతియుతంగా, ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని అన్నారు. మహిళలు బతుకమ్మ ఆడేటువంటి ప్రాంతాల్లో, దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని అన్నారు. ఎస్పీ వెంట సీ.ఐ కరుణాకర్ ఎస్.ఐ లు కుమారస్వామి,మల్లేష్ ,రవి కిరణ్ ,సుప్రియ,సిబ్బంది పాల్గొన్నారు.

## "విజయవాడ హాటెస్ట్ సిటీ, కూల్ పీపుల్"

## ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

**విజయవాడ ఉత్సవ్‌లో తెలుగు భాష, సంస్కృతి వైభవాన్ని ప్రశంసించిన ఉపరాష్ట్రపతి**

**తెలుగు భాష సాహిత్యభరితం, సంగీతభరితం ? అందుకే అందమైనది**

**నవరాత్రుల్లో అమ్మవారిని తొమ్మిది రోజులు పూజించడం భారతీయుల అదృష్టం**

**మహిళా శక్తిని గౌరవించడం భారతీయ సంప్రదాయం**

**ఆంధ్రప్రదేశ్ విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వేగంగా అభివృద్ధి**

**వికసిత భారత్ కల కాదు ? నిజం అవుతోంది**

**సీఎం చంద్రబాబు నేతృత్వంలో వికసిత ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు**

**ఉపరాష్ట్రపతి అయ్యాక తొలి అధికారిక పర్యటన విజయవాడకే**

**విజయవాడ ప్రజల ఆతిథ్యం హృదయాన్ని తాకింది**

**కనకదుర్గ పేరులోనే అనుగ్రహం, ప్రేమ, అమృతం విజయవాడ ఉత్సవ్ కు శ్రీకారం చుట్టిన ఎంపీ కేశినేని శివనాథ్ పై ప్రత్యేక ప్రశంసలు..**




విజయవాడ, సెప్టెంబరు 24: విజయవాడ పున్నమి ఘాట్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ ? 2025 లో ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ గారు పాల్గొని, నగర ప్రజల మనసు హత్తుకునేలా ప్రసంగించారు.ప్రారంభంలో అందరికీ "తెలుగు భాషలో నమస్కారం" చెప్పి తన ప్రసంగాన్ని కొనసాగించిన ఉపరాష్ట్రపతి గారు, తెలుగు భాష అందం, సాహిత్యం, సంగీతం వైభవాన్ని ప్రశంసిస్తూ, "అందమైన తెలుగులో పాడిన పాటలు అద్భుతంగా ఉంటాయి. సాహిత్యభరితంగా, సంగీతభరితంగా ఉండటమే తెలుగు భాషను ప్రత్యేకం చేస్తోంది" అని అన్నారు.విజయవాడ ఉత్సవ్ మరిన్ని దశాబ్దాలు, శతాబ్దాలు కొనసాగాలని ఆకాంక్షించిన ఆయన, నవరాత్రి ఉత్సవాల ప్రత్యేకతను గుర్తుచేశారు. "దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రులు ఎంతో ప్రత్యేకం. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని భక్తితో పూజించే సంప్రదాయం భారతీయుల అదృష్టం. ఇది సాంప్రదాయానికి, సంస్కృతికి అద్దం పడుతోంది" అని పేర్కొన్నారు. మహిళా శక్తిని గౌరవించడం భారతీయ సంప్రదాయమని, అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా కొలవడం ద్వారా శక్తి, భక్తి రెండూ లభిస్తాయి అని ఉపరాష్ట్రపతి చెప్పారు.విజయవాడ ప్రత్యేకతపై మాట్లాడుతూ ఆయన, "విజయవాడ హాటెస్ట్ సిటీ, కూల్ పీపుల్. రాబోయే రోజుల్లో విజయవాడ దేశంలోనే అభివృద్ధి చెందిన నగరంగా నిలవబోతోంది" అని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పై మాట్లాడుతూ, "విద్య, వైద్యం రంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతోంది. వికసిత భారత్ అనేది ఒక కల కాదు, అది నిజం. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తోంది. శాస్త్ర, సాంకేతిక, వైద్య, విద్య రంగాల్లో కూడా రాష్ట్రం విశేష పురోగతిని సాధిస్తోంది" అని అన్నారు.ఉపరాష్ట్రపతి బాధ్యతలు చేపట్టిన తర్వాత తన మొదటి అధికారిక పర్యటన విజయవాడకే రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన, "విజయవాడలో అద్భుతమైన గౌరవం లభించింది. ఇక్కడి సంప్రదాయాలు, సంస్కృతి దేశానికి గర్వకారణం. కనకదుర్గ అమ్మ పేరులోనే అనుగ్రహం, ప్రేమ, అమృతం నిక్షిప్తమై ఉంది" అని భావోద్వేగంగా తెలిపారు.మంత్రులు, అధికారులు అందరూ కలసి రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరుతూ, రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అంతేకాక, ఉత్సవ వేదికపై గాయని గీతా మాధురి పాడిన పాటలను ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సందర్భంగా ఆయన ప్రసంగం, విజయవాడ ఉత్సవ్ లో పాల్గొన్న వేలాది మంది ప్రజల్లో ఉత్సాహాన్ని నింపగా, నగర అభివృద్ధి పై ఆయన విశ్వాసపూర్వక మాటలు హాజరైన వారందరిలో ఆనందాన్ని కలిగించాయి.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన చల్ గల్ విద్యార్థిని



జగిత్యాల, నిజామాబాద్ లో జరుగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు చల్ గల్ జడ్పి హైస్కూల్ విద్యార్థిని శిరిన్ మిత్ర ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతాదేవి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటన లో ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ సబ్ జూనియర్ పోటీలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఈ టోర్ని కి చల్ గల్ జడ్పి స్కూల్ విద్యార్థిని శిరిన్ మిత్ర ఎంపికైందని, ఈ టోర్ని లో తన ప్రతిభ ను కనబరస్తుందని హెచ్. ఎం. ఆశాభావం వ్యక్తం చేశారు. టోర్ని కి ఎంపికైన విద్యార్థిని శిరీన్ ను హెచ్. ఎం. తోపాటు పి. డి. వెంకట లక్ష్మి, ఆ పాఠశాల చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి:: డాక్టర్ స్వాతి



కోరుట్ల, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం మెగా వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని వైద్యాధికారి ని డాక్టర్ స్వాతి లక్ష్మణ్ తెలిపారు.బుధవారం అల్లమయ్యగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి సశక్తు పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జరిగిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే తమ యొక్క కుటుంబం అంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు.ఈ ప్రత్యేక కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అర్జున్, గైనకాలజిస్ట్ డాక్టర్ రూహి మంజూర్, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ ఇంతియాజ్ అలీ,జనరల్ సర్జరీ నిపుణులు డాక్టర్ అచ్యుత్ పాల్గొన్నారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని మున్సిపల్ కార్మికులతో పాటు 114 మంది సద్వినియోగం చేసుకున్నారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ స్వాతి లక్ష్మణ్, డాక్టర్ రాధా రాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ మజీద్, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 26న బి.ఆర్.ఎస్ ఆధ్వర్యములో జరిగే "లంబాడీ భేరి"కి వేలాదిగా తరలిరాండి

వనపర్తి లంబాడీలకు కె.సి.ఆర్ అన్నం పెడితే....రేవంత్ రెడ్డి సున్నం పెడుతున్నాడు.అభివృద్ధి చేతకాక కులాల మధ్య చిచ్చుపెడుతున్న కాంగ్రెస్ పార్టీ లంబాడీ భేరి సన్నాహక సమావేశంలో పాల్గొని మద్దతు ప్రకటించి దిశా నిర్దేశం చేసిన మాజీ మంత్రి ఆదివాసులతో పాటు లంబాడీ హక్కులు కాపాడాలి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పష్టం చేసారు. కె.సి.ఆర్ లంబాడీల భవిష్యతు కోసం అనేక సంక్షేమ పథకాలు పోడు భూములకు పట్టాలు ప్రత్యేక గ్రామ పంచాయతీల ఏర్పాటు కళ్యాణ లక్ష్మీ,రైతు భరోసా, రైతు బీమా,రైతు రుణ మాఫీతో లంబాడీల రిజర్వేషన్లకు భాగం వాటిల్లకుండా మా హక్కులు కాపాడితే నేటి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న మంత్రి సీతక్క ఎస్.టి.జాబితా నుండి తొలగించాలని సుప్రీం కోర్టులో కేసులు వేయించాడని తీవ్రంగా ఖండించారు. ఎస్.టి. జాబితా నుండి లంబాడీలను తొలగించాలి అని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగ బి. ఆర్.ఎస్ ఆధ్వర్యములో ఈ నెల 26న లంబాడీల భేరి నిర్వహిస్తున్నామని లంబాడీలు అధిక సంఖ్యలో తరలివచ్చి మన హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్నికి మద్దతు తెలపాలని .మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో జరిగిన సన్నాహక సమావేశములో జిల్లా ఎస్.టి.సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్, జాత్రు నాయక్ పిలుపునిచ్చారు.

# డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు జీ టీవీ అచీవ్‌మెంట్ 2025 అవార్డు







**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్24 (ప్రజాబలం)**ఖమ్మం పౌరసమితి మహాత్మా గాంధీ ఫౌండేషన్ ల చైర్మన్ న్యాయవాది ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పులిపాటి ప్రసాద్ ప్రతిష్టాత్మక జీ టీవీ అచీవ్‌మెంట్ అవార్డు 2025 ను ఘనంగా అందుకోనున్నారు ఈ కార్యక్రమం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జరగనున్నది పద్మ విభూషణ్ నాగేశ్వర్ రెడ్డి పద్మశ్రీ మందా కృష్ణ పలు నంది అవార్డుల గ్రహీత తనికెళ్ల భరణి వంటి ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన బోతున్నారు ఈ సందర్భంగా డా. పులిపాటి ప్రసాద్ సేవా కృషిని ప్రశంసిస్తూ పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు అభినందనలు తెలిపిన వారిలో కడవెండి శ్రీనివాస్ కొత్త వెంకటేశ్వర రావు గోళ్ళ రాధాకృష్ణ షేక్ ఖాసిం సతీష్ చౌదరి గుమ్మడివెల్లి శ్రీనివాస్ వరప్రసాద్ మృత్యుంజయ గుప్తా, వజీనేపల్లి శ్రీనివాస్, సిద్ధంశెట్టి శ్రీకాంత్ పద్మజా రెడ్డి శ్రీకళా రెడ్డి రాజారెడ్డి, రాజేష్, ప్రతాప్, నీరజ, రామకృష్ణ, కొదుమూరి జగన్నాథం కొదుమూరి భద్రయ్య వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, రాజారావు కొల్లూరు కృష్ణమూర్తి బూర్లె లక్ష్మీనారాయణ బూర్లె వెంకటేశ్వర్లు పాల్వంచ రామారావు, కొత్తూరు రమేష్ తదితరులు వున్నారు

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

## షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సిహెచ్ దుర్గ ప్రసాద్




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 24:**అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సిహెచ్ దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలు తెలిపారు. 2025 - 26 సంవత్సరం గాను తెలంగాణ ప్రభుత్వ ప్రభుత్వం విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీ స్ విద్యార్థి పథకం ద్వారా షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్షిప్ ను అందజేసేందుకు నిర్ణయించిందని ఆయన తెలిపారు. యూఎస్ఏ యూకే, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుకేషన్ వదలకు ప్రొఫెషన్ కోర్సులలో చదవాలని కోరుకుంటున్నా వారినుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. విదేశాల్లో చదువుకునేందుకు ఈనెల 28 నుండి నవంబర్ 19 వరకు www.telangana.epass.cgg.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని ఎప్పుడైనా విద్యార్థులకు 20 లక్షల మంజూరు చేస్తామని ఎస్సి విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. మంచిర్యాల జిల్లాకు చెందిన ఎస్సీ కులం వారి ఉండాలి సంవత్సరాదాయం ఐదు లక్షల మించకుండా ఉండాలి పీజీ చదవడానికి గ్రాడ్యుయేషన్ 60% కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలన్నారు. పాస్పోర్ట్ మరియు వీసా కలిగి ఉండాలని విదేశీ విశ్వవిద్యాలయం అడ్మిషన్ పొంది ఉండాలని ఒకే కుటుంబం నుండి ఒక్కరికి మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు. %యాఖీజుూ/×జుూయా/+=జు/+హీూ% లో ఎక్కువ శాతం అర్హత కలిగి ఉండాలని తెలిపారు.

## అమ్మవారి దయ తో గ్రామాలు సస్యశ్యామలం

## దేవి నవరాత్రుల పలు మండపాలను సందర్శించిన మల్లి బాబు యాదవ్




**ఇల్లందు ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం)** ఇల్లందు నియోజకవర్గం శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు మల్లిబాబు యాదవ్ పలు దేవి మండపాలను సందర్శించి దేవి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు చేశారు. తదనంతరం పండితాపురం గ్రామంలో పేదలకు ప్రభుత్వం నుండి మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఏ పని చేయాలన్నా శక్తి అవసరమని, ఆ శక్తికి ప్రతిరూపమే అమ్మవారని, ఈ నవరాత్రి ఉత్సవ కార్యక్రమాలలో మొదటి మూడు రోజులు అమ్మవారిని దుర్గాదేవిగా, తర్వాత మూడు రోజులు, సరస్వతి దేవిగా, తర్వాత మూడు రోజులు లక్ష్మీదేవిగా అలంకరించబడి పూజలు అందుకోవడం జరుగుతుందని, ఈ మూడవ రోజున అన్నపూర్ణాదేవి ని మనస్పూర్తిగా పూజించి, దర్శించుకుంటే అన్న పానాధులకు ఎలాంటి లోటు ఉండదని, గ్రామాలు పచ్చని పైరులతో సస్యశ్యామలం గా పచ్చగా కళకళలాడతాయని పండితులు చెప్తారని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని, ఎంత త్వరగా పూర్తయితే అంత తొందరగా బిల్లులు మంజురవుతాయని, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ విషయంలో శ్రద్ధ తీసుకుంటుందని, ఇండ్ల లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మేకపోతుల మహేష్, జన్నారపు లింగయ్య, భూక్య నాగేంద్రబాబు, వేముల రాంబాబు, గునగంటి నాగరాజు, అశోక్, బత్తుల రాములు గుడివాడ శ్రీను, రేళ్ళ నాగమణి కళావతి, బండి లక్ష్మీనర్స్ తురక రవి బండి నాగరాజు, బండి పాపయ్య గుండ్ల వెంకన్న, పూజారి గణపతి బొట్ల మధు, పంచాయతీ సెక్రెటరీ శంకర్ మరియు తదితరులు లబ్ధిదారులు పాల్గొన్నారు

# దుర్గామాత మండపం వద్ద అన్న ప్రసాద వితరణ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జోగిపేట పట్టణంలోని, శ్రీ పబ్బతి హనుమాన్ ఆలయం ముందు గత 25, సంవత్సరాల నుండి, దుర్గామాతను ప్రతిష్టించి, సిల్వర్ జూబ్లీ పురస్కరించుకున్న సందర్భంగా, నిర్వాహకులు ఈ సంవత్సరం కూడా, శ్రీ దుర్గా భవాని విగ్రహ ప్రతిష్ట చేసి, అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు, ఈ నవరాత్రుల్లో భాగంగా నిర్వాహకులు, రోజు దాదాపు 500 మందికి మధ్యాహ్నం మండపం వద్ద, అన్న ప్రసాద వితరణ చేపట్టారు, ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు, పులుగు గోపాలరావు మాట్లాడుతూ, ఆదిశక్తి దుర్గాభవాని మాత చల్లని దీవెనలతో, పట్టణంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ట చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది, దేవి చల్లని కరుణ కటాక్షాలతో, పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని వేడుకొన్నారు, ఈ అన్న ప్రసాద వితరణ, దసరా పండుగ వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో స్నేహ సిరి యూత్, నాయకులు ఉలువల రాజు, పులుగు నరసింహారావు, ముద్దు కృష్ణ, సతీష్, జగదీష్, అల్లే శివ,రాజు, కన్నా, శ్రీనివాస్, రామకృష్ణ, మహేష్, మరియు మాత టీం, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.....

# నిరుపయోగంగా ఉన్న మొబైల్ టాయిలెట్




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్– జోగిపేట, మున్సిపాలిటీ పరిధిలోని, దాదాపు కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేసి, దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం తెచ్చి, ప్రారంభోత్సవం రోజు ప్రారంభించి, ఉపయోగించకపోవడం వల్ల, మొబైల్ టాయిలెట్ వాహనం, నిరుపయోగంగా క్రీడా మైదానం పక్కన పెట్టగా, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల, తుప్పు పట్టి పోతుందని పలువురు తమ ఆవేదన వ్యక్తం చేశారు, మునిసిపల్ అధికారులు బలవంతంగా, పన్నులు వసూలు చేస్తారు తప్ప, అధికారులకు ఇది కనిపించడం లేదా అని పలువురు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు......

# దసరా కి వెళ్తున్నారా జర భద్రం

## జోగిపేట ఎస్సై పాండు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** అందోల్ నియోజకవర్గం, బతుకమ్మ,, దసరా,పండుగలకు సెలవులు రావడంతో, చాలామంది సొంత గ్రామాలకు ఇతర ప్రాంతాలకు గాని, ప్రయాణాలు చేస్తుంటారు, పండుగలకు తమ సొంత గ్రామాలకు వెళ్లేవారు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, తమ ఇంటి బయట ఒక లైట్ వేసి ఉంచాలని, అనుమానాస్పదంగా తమ వీదుల్లో తిరిగే కొత్త వ్యక్తుల కదలికలపై, అనుమానం వస్తే, 100, నెంబర్ కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, జోగిపేట ఎస్సై పాండు తెలిపారు....

# కోల్ ఇండియా పోటీలకు బత్తుల వెంకటస్వామి, బెల్లం అరుణ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 24:**వర్క్ పీపుల్ స్పోర్ట్స్అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంపెనీ లెవెల్ బాడీబిల్డింగ్, వెయిట్లిఫ్టింగ్, పవర్లిఫ్టింగ్ పోటీలను భూపాలపల్లి మినీ ఫంక్షన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనరల్ మేనేజర్ భూపాలపల్లి రాజేశ్వర్ రెడ్డి పాల్గొని విజేతలకు మెడల్స్ అందించారు. ఈ టోర్నమెంట్ లో మన మందమర్రికి చెందిన క్రీడాకారులు బత్తుల వెంకట స్వామి, ఏరియావర్క్ షాప్, (95 కేజీ కేటగిరీ) బాడీబిల్డింగ్ లో,

బెల్లం అరుణ్ పంప్ ఆపరేటర్,కాసిపేట్-1, (79కేజీ కేటగిరి )వెయిట్ లిఫ్టింగ్ లో గోల్డ్ మెడల్స్ సాధించి కోల్ ఇండియా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. కోల్ ఇండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మందమరి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ, ఎస్.ఓ.టూ. జి. ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్ విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.కార్తీక్ (సీనియర్ పి.ఓ, జి యం ఆఫీస్ )క్రీడల గౌరవ కార్యదర్శి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ , శాఖ శ్రీను జనరల్ కెప్టెన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) సెప్టెంబర్ 24 :** బుధవారం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ బతుకమ్మ సంబరాల నేపథ్యంలో రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని, ఈ పండుగలో సమాజంలోని అన్ని వర్గాల మహిళలు ఒక్కటిగా కలసి జరుపుకోవడం ప్రత్యేకత అని అన్నారు.

ములుగు జిల్లాలో సెప్టెంబర్ 27వ తేదీన సాయంత్రం 3.00 గంటలకు ములుగు కలెక్టరేట్ లో జరగబోయే బతుకమ్మ సంబరాలలో మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాలు మరియు ప్రజలందరూ విశేషంగా పాల్గొని పండుగ వైభవాన్ని మరింతగా పెంచాలని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సంపత్ రావు (అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు) మాట్లాడుతూ ప్రతి మహిళా ఉద్యోగి ఈ బతుకమ్మ సంబరాలలో తప్పనిసరిగా పాల్గొనాలనీ తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించే

ఈ పండుగలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయని, బతుకమ్మను ఉత్సాహభరితంగా జరుపుకోవడానికి జిల్లా సంఘం తరఫున అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

జిల్లా ఉపాధ్యక్షురాలు కే. శిరీష ఆధ్వర్యంలో ఈ బతుకమ్మ సంబరాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కందుల జీవన్ కుమార్ ఉపాధ్యక్షురాలు కే. శిరీష, జిల్లా నాయకులు ఆర్. రామకృష్ణ, రఫిక్, శైలజ, నాగశ్రీ, భగవత్ గీత, అనంతలక్ష్మి, కమరున్నిసా బేగం, రమాదేవి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడికి రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు ఇప్పించిన -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి




**కూకట్పల్లి (ప్రజాబలం) సెప్టెంబర్ 23:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ ఇండస్ట్రీ ఏరియాలో సిరిని ఫార్మా కెమికల్స్ లిమిటెడ్ కంపెనీలో గోపి బాబు అనే కార్మికుడు గత ఏడు సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కొన్ని అని వార్య కారణాలవల్లసిరి ఫార్మా కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మానేయడం జరిగింది. గోపి బాబు అనే కార్మికుడికి గ్రాడ్యుయేట్ డబ్బులు 1,05,000 రావలసిన ఉండగా అవి ఇవ్వకపో వడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా గోపి బాబు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తనను ఏదో రకంగా కంపెనీ యజమాన్యం పట్టించుకోవడం లేదు అని తెలుసుకొని అడిగి విసుగు చెందిన కార్మికుడు గోపి బాబు తనకు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి గోపి బాబుకు రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు లక్ష అయిదు వేలరూపాయలు ఇప్పించడం జరిగింది కార్మికుడు గోపి బాబు, మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ కోర్టు ఆవరణలో ఘనంగా బతుకమ్మ వేడుకలు. పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** బుధవారం రోజున వేములవాడ కోర్టు ఆవరణలో సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా న్యాయవాదులు, జ్యుడిషల్ సిబ్బందితో కలిసి జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ దేవుళ్లను పూలతో పూజిస్తాము, కానీ పూలనే దేవులుగా పూజించే గొప్ప సాంస్కృతి తెలంగాణలోనే ఉందని, తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేశారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండా రవి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, మహిళా న్యాయవాదులు కొడిమ్యాల సంగీత, జక్కుల పద్మ, తమిరి అన్నపూర్ణ, మొగిలి సుజాత, బూర సరిత, మమత, నక్క వేద జ్యుడీషియల్ మహిళా సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## సైడ్ డ్రైనేజ్ పక్కన గడ్డి మొక్కలను శుభ్రం చేయించుకున్న కార్పొరేటర్ చామకూరి వెంకట్ నారాయణ



**ఖమ్మం ప్రతినిధి సెప్టెంబర్ 24 (ప్రజాబలం)** కార్పొరేషన్ పరిధిలో గల19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ దగ్గర ఉండి డివిజన్ లోని సైడ్ డ్రైనేజ్ పక్కన గడ్డి మొక్కలను శుభ్రం చేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శంకర్, జవాన్ నాగరాజు పాషా నర్సిరెడ్డి భాస్కర్ బాల శివరాం శ్యామల రాజు వరికోటి భాస్కర్ విజయలక్ష్మి కన్నెబోయిన ముత్తయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

# దిల్కుష్ నగర్ లో మహిళా మండలి బిల్డింగ్ ప్రారంభించిన.. కృష్ణారావు



**కూకట్పల్లి (ప్రజాబలం) సెప్టెంబర్ 23:** బాలానగర్ డివిజన్ పరిధి దిల్కుష్ నగర్ లో మహిళా మండలి బిల్డింగ్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పార్టీ పరిపాలనలో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి సారథ్యంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకున్నామని దశాబ్దలకాలంగా కలగానే మిగిలిపోయిన దిల్ కుష్ నగర్ వాసుల ప్రధానంగా మెయిన్ రోడ్డు నిర్మాణం అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజ్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలను పూర్తి చేసుకోగలిగామని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా ముందుకు పడటం లేదని. ప్రజలు ఇప్పటికే కేసీఆర్ పరిపాలన గుర్తు చేసుకుంటూ తిరిగి మళ్ళీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని ఉద్దేశంతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ గోశాలకు వీధి దీపాల విరాళం.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** బుధవారం రోజున దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గోశాలకు వీధి దీపాలను విరాళంగా అందించారు. హైదరాబాద్ వాస్తవ్యుడు సాగోత్ నగర్ కు చెందిన ప్రణయ ఎలక్ట్రిషన్ (సుమంత్ శర్మ) 10 విద్యుత్ విధి దీపాలను ఆలయ కార్యనిర్వాణాధికారి ఎల్. రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘునందన్, సహాయ కార్య నిర్వాహక అధికారి జి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి 1,00,116 నగదు విరాళం.

వేములవాడలోని పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కు కొత్తపల్లి సత్యనారాయణ రూపాయలు 100,116/-బుధవారం రోజున విరాళంగా అందించారు.

జగిత్యాల జిల్లా కేంద్రం బ్రాహ్మణ వాడకు చెందిన సత్యనారాయణ ఈ విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. వీరి ఇరువురికి స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.

## సంగారెడ్డి పట్టణంలో మంచి నీటి సమస్య తీర్చడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలి... సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సంగారెడ్డి మున్సిపల్ కమిషన్,అధికారులతో వాటర్ ,సానిటేషన్, సెక్రికేషన్ గురించి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు సమీక్షించారు,సంగారెడ్డి పట్టణ ప్రజలకు మంచి నీటి సరఫరా లో అధికారులు నిర్లక్ష్యం చెయ్యొదని ఎమ్మెల్యే గారు సూచించారు,వాటర్ ప్రాబ్లమ్ మీద గ్రిడ్ వాళ్లతో టాక్స్ 25 శాతం మాత్రమే కలెక్ట్ అయిందని ఎమ్మెల్యే గారు అసహనం వ్యక్తం చేస్తూ మార్చు లోపల ఆస్తిపన్ను వసూలు చేయాల్సిందిగా సూచించారు,నీటి పన్ను బకాయిలు కోట్ల రూపాయలలో పేరుకుపోవడం వల్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ బకాయిలన్నీ కూడా త్వరగా వసులు చేయాలని అధికారులకు సూచించారు,సంగారెడ్డి పట్టణానికి త్రాగు నీరు 10 ఏంఎల్డి అవసరం పడతాది కనీసం 7 ఏంఎల్డి కి తగ్గకుండా సరఫరా చేయాలని ఎమ్మెల్యే గారు మిషిన్ భగీరథ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు

## రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దేవీ నవరాత్రి ఉత్సవాల మూడో రోజు అయిన బుధవారం రోజున, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాజన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.

ఆలయానికి చేరుకున్న ఆది శ్రీనివాస్ కు అర్చకులు మరియు వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీ గణపతి మరియు శ్రీ స్వామి వారి పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. చంద్ర గంట అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామ సేవా కార్యక్రమం వాతావరణం కారణాలవల్ల ఆలయ అంతరాలయంలో నిర్వహించగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారి సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి పల్లకి మోశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ .రమాదేవి, మరియు ఏఈఓ లు బ్రహ్మన్న గారి అశోక్ కుమార్, మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# టీజీవోస్ ఆధ్వర్యంలో జరిగే బతుకమ్మ సంబరాల గోడపత్రికను ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్



**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:**బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా టిజిఓఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు , కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి తో పాటు కార్యవర్గ కమిటీ సభ్యులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శ్రీ సి. నారాయణ రెడ్డి , ఐఎఎస్,ను IDOC, కొంగరకలాన్ నందు కలిసి ఈనెల 27వ తేదీన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి లోని టీజీవో భవన్ వద్ద జరిగే బతుకమ్మ సంబరాల గోడపత్రికను రంగారెడ్డి కలెక్టర్ గారు ఆవిష్కరించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ( రెవెన్యూ), డిఆర్ఓ గారిని మరియు మిగతా జిల్లా అధికారులను కూడా కలిసి ఈనెల 27వ తేదీన జరిగే బతుకమ్మ సంబరాలకు ఆహ్వానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శ్రీమతి శాంతిశ్రీ, శ్రీమతి మహేశ్వరి, శ్రీమతి పద్మావతి, శ్రీమతి అలివేలు, శ్రీమతి సైదమ్మ, వెంకటేష్, లక్ష్మణ స్వామి, రాకేష్ కుమార్, మరియు పెద్ద ఎత్తున మహిళలు డాక్టర్ కె. రామారావు, అధ్యక్షుడు,శ్రీనేష్ కుమార్ నోరి, కార్యదర్శి, TGOs అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా. పాల్గొన్నారు.

## దసరా పండుగ ఏర్పాట్లను పరిశీలించిన జి.ఎం రాధాకృష్ణ





**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ సెప్టెంబర్ 24** మందమర్రి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్లో నిర్వహించబోవు సద్దుల బతుకమ్మ, మరియు దసరా ఉత్సవాల పనుల పురోగతిని బుధవారం మందమరి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ సింగరేణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ మరియు దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని, ఈ వేడుకలలో పాల్గొనే ఉద్యోగులు మరియు పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు తగు సూచనలు సలహాలు తెలియచేశారు.

కేటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం విజయ ప్రసాద్, ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ పట్టణం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్నూరు కాపు కుల బాంధవులలో పలువురు డాక్టర్స్, వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులు సభ్యతాలు తీసుకోవడం జరిగింది. వీరిలో డాక్టర్ నామాల ప్రదీప్, డాక్టర్ కోయినేని రాజేందర్, డాక్టర్ ఐతమ్ పరశురాం, డాక్టర్ మట్లపల్లి మహేందర్, నామాల ప్రసాద్, నామాల ప్రశాంత్, నామాల ప్రణీత్, కోయినేని హరిప్రసాద్, కోయినేని శివశంకర్, నంది గోవర్ధన్, తోగరి సాయికుమార్, నరిగే శ్రీనివాస్, ఇట్టి కుల బాంధవులలో ఒక్కో సభ్యునికి 25,000/బిరూపాయలతో తమ సభ్యత్వాలు తీసుకున్నారు. అలాగే వేములవాడ పట్టణంలో ఉన్న మున్నూరు కాపులు ఎవరైనా తమ సభ్యత్వాలు నమోదు చేసుకోవాలంటే వేములవాడ పట్టణ మున్నూరు కాపు సంఘం లో సంప్రదించాలని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో వేములవాడ పట్టణం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోయి నేని బాలయ్య, గౌరవ అధ్యక్షులు నామాల పోశెట్టి, బింగి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సోమినేని మహేష్, ఉపాధ్యక్షులు ఉప్పుల దేవరాజ్, వరి లక్ష్మీనారాయణ, మర్రిపల్లి మల్లేశం, ఆకుల శ్రీనివాస్, నామాల శేఖర్, కూరగాయల శంకరయ్య, కోశాధికారి రామ తీర్థపు వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి జయవరపు శ్రీధర్, కార్యదర్శులు చిలుక దేవరాజు, ఇప్ప పూల వినోద్, బుట్టి రమేష్, రైకనపేట అంజయ్య, జాయింట్ సెక్రెటరీ బోనాల శివ, మీడియా కన్వీనర్ తొగరి కరుణాకర్, చేకూర్తి నవీన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24** : ప్రభుత్వం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలను అందించడం కోసం వైద్యులు,సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం హాజీపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని తహసిల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే తో కలిసి సందర్శించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జాతీయ రహదారి 63 నిర్మాణంలో భాగంగా భూసేకరణ కార్యక్రమానికి సంబంధించి అవార్డుల జారీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వివిధ రకాల ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా ధ్రువ పత్రాలు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ డి.ఈ. సజ్జత్ భాషా,ఈ.ఈ. లక్ష్మీనారాయణ, ఎ.ఈ.ఈ.అనూష, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పారిశ్రామిక సహకార అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది. చేనేత సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.







**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** చేనేత పారిశ్రామిక సహకార అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రోజున వేములవాడ పట్టణంలో చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉత్పత్తి %ఽ% వినియోగదారుల సంఘం లిమిటెడ్ 78 వార్షిక, 93 సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. నేత కార్మికులకు గడిచిన 10 ఏళ్ల కాలంలో ఉన్న బకాయిలను ప్రజా ప్రభుత్వం విడుదల చేస్తుందని అన్నారు. నేత కార్మికుల కోరిక మేరకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశామని తెలిపారు. నేతన్న చేయూత, నేతన్న బీమా వంటి అనేక పథకాలు బకాయిలు జమ చేస్తున్నామని తెలిపారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసి ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నుల నూలు దారం 100 సొసైటీలకు అందించమని తెలిపారు.

వస్త్ర పరిశ్రమలో ఆధునిక సాంకేతికను పెంచేందుకు హ్యాండ్లూమ్ యూనివర్సిటీ, ఐఐహెచ్ టి ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

రైతుల మాదిరిగానే నేత కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతన్న బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకంలో నమోదు కాబడిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించబడుతుంది అని తెలిపారు.

జిల్లా పరిధిలో చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ పథకం ద్వారా ఇప్పటివరకు 15.62 లక్షల మందికి అంద చేయడం జరిగిందని అన్నారు. ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్న పేద ప్రజలపై పన్నుల భారం మోపకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

# పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న మెతుకు ఆనంద్




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 24( ప్రజాబలం )** వికారాబాద్ జిల్లా: మర్పల్లి /మైటీ ఫంక్షన్ హాల్ లో జరిగిన మర్పల్లి మండలం పెద్దపూర్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ కుమార్ గారి కూతురు పుట్టినరోజు వేడుకల్లో. వికారాబాద్ నియోజకవర్గం . బి ఆర్ ఎస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్న వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నట్టు తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com